జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php
సంపుటి 15 సంచిక 236 విశాఖపట్నం | గురువారం 12 మే 2022 | 8 పేజీలు | వెల : 5.00

విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహా గ్రూప్ సభ్యులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును
వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించగలరు
9000621111, 9440137451



# కాలం చెల్లిన చట్టాలు ఇంకెన్నాళ్లు..?

దేశద్రోహం కేసుల్లో కేంద్రం తన వైఖరిని 24 గంటల్లో చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశద్రోహ చట్టం అమలును ఆపుతారా లేదా అన్న అంశంతోపాటు దీని కింద ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని కాపాడతారా అన్న అంశంపై రేపటికల్లా సమాధానం చెప్పాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణలో భాగంగా దేశద్రోహ చట్టాన్ని మూడు నాలుగు నెలల్లో పునఃసమీక్షించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. అప్పటిదాకా 124ం సెక్షన్ కింద కేసులు, వాటి దర్యాప్తును నిలుపుదల చేయాలని రాష్ట్రాలకు కేంద్రం ఎందుకు ఆదేశించడం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమణ సారధ్యంలోని ధర్మాసనం ప్రశ్నించింది. దేశద్రోహ చట్టం చెల్లుబాటుపై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో పరిశీలిస్తోందన్నారు. ఇప్పుడు చట్టం చెల్లుబాటును వినవద్దు. మరోవైపు, కపిల్ సిబల్ వినికిడిని ఆపడానికి ఇది కారణం కాదని అన్నారు. పార్లమెంటులో కొత్త చట్టం పెండింగ్‌లో లేదు. పాత చట్టాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. దీనిపై సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై నోటీసులు జారీ చేశామన్నారు. ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనికి ఎంత సమయం పడుతుంది? దీనిపై సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ.. ఈ చట్టం 100 ఏళ్లకు పైగా అమల్లో ఉందని చెప్పారు. మేం చెప్పినది కోర్టు పరిగణనలోకి తీసుకుంటే రాజ్యాంగ ధర్మాసనం వినాలి. కానీ ఇప్పుడు విచారణ జరపవద్దని మేము కోరుతున్నాము. అన్నది ఇప్పుడే చెప్పలేను. ఇందుకు సంబంధించి వర్క్ సీరియస్ గా సాగుతుందని తెలిపారు. రాజద్రోహం చట్టాన్ని పునఃపరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియజేసింది. ఈ నేపథ్యంలో 160 సంవత్స రాలకు పైగా చర్చ జరుగుతున్న ఈ చట్టం అమలు తీరు, దాని పర్యవసానాలపై పౌర సమాజం ఆసక్తితో ఉంది. మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగం వెలుగులో జీవిస్తున్న సమాజం మనది. మానవ సమాజ పరిణామ క్రమంలో మనుషులకు అవసరం లేనివి కాలగర్భంలో కలిసిపోతాయి. ఆ విధంగానే నల్ల చట్టాలు కూడా మిగలొద్దని అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి ఎన్నో దేశాలు వాటిని రద్దు చేసుకున్నాయి. మరి మనది 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశం. రాజుల కాలం పోయింది. సంస్థానాలు కూలిపోయి నాయి. కానీ రాజులేని కాలంలో రాజద్రోహ చట్టాన్ని ఇంకా కాపాడుతున్నది ఎవరనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య దేశంలో ఒక అవమానకరమైన పరిస్థితిని సూచిస్తుంది. అందుకేనేమో తెలుగు తేజం జస్టిస్ ఎన్వీ రమణ భారత ప్రధాన న్యాయ మూర్తిగా బాధ్యతలు స్వీకరించిన కొద్దికాలానికే రాజద్రోహానికి కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. భారత స్వతంత్ర ఆకాంక్షను అణచివేయడానికి బ్రిటిష్ వారు 1860లో ఇండియన్ పీనల్ కోడ్‌లో రాజద్రోహాన్ని పొందుపరిచారు. మహాత్మాగాంధీ, బాలగంగాధర తిలక్, జవహర్ లాల్ నెహ్రూ, **(మిగతా 2లో..)**

# హై అలర్ట్‌గా ఉండాలి..

## సీఎం జగన్ అత్యవసర వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి : తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయక చర్యలపై సమీక్ష జరిపారు. ఇప్పటికే తొమ్మిది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను జిల్లాలకు ప్రభుత్వం పంపింది. తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ఆదేశాలు జారీ చేశారు. తుపాను నేపథ్యంలో హై అలర్ట్‌గా ఉండాలన్నారు. ఇప్పటికే మీకు నిధులు ఇచ్చామని, తుపాను తీరం వెంబడి ప్రయాణిస్తోంది కాబట్టి తీర ప్రాంతాల్లో మరింత అప్రమత్తం అవసరమని'' కలెక్టర్లు, అధికారులకు సీఎం సూచించారు. "కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుపాను బలహీనపడటం ఊరటనిచ్చే అంశం. అయినా ఎక్కడా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు. ప్రజలకు ఎలాంటి ముప్పు రాకుండా చూడాలి. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి. అవసరమైన చోట సహాయపునరావాస శిబిరాలను తెరవండి. సహాయ శిబిరాలకు తరలించిన ఒక వ్యక్తికి రూ.వెయ్యి, కుటుంబానికి రూ. 2వేల చొప్పున ఇవ్వండి. సహాయ శిబిరాల్లో మంచి సౌకర్యాలు ఏర్పాటు చేయండి. జనరేటర్లు, జేసీబీలు.. ఇవన్నీకూడా సిద్ధంచేసుకోండి. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడితే వెంటనే చర్యలు **(మిగతా 2లో..)**

# అసని తుఫాన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి : అసని తుఫాన్ దిశ మార్చుకుంది. దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతంలో అనేక జిల్లాలు తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లాల యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేయడంతోపాటు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తోంది. తుఫాన్ ప్రభావం భారీగా ఉంటుందని అంచనా వేసినప్పటికీ.. క్రమ క్రమంగా బలహీనపడడంతో కొంత వరకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నిన్న మచిలీపట్నం వద్ద తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే తన దిశ మార్చుకున్న అసాని తుఫాన్ నరసాపురం–కాకినాడ మధ్య తీరం దాటే అవకాశం ఉందన్నారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సముద్రతీర ప్రాంతంలో నివశించే వారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. రవాణా వ్యవస్థ స్తంభించింది. కొన్ని ప్రాంతాల్లో బస్సులు, రైళ్లు, విమానాల సర్వీసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. తుఫాన్ ప్రభావం కారణంగా రైతులు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. వరి, ఉద్యానవనం, మామిడి పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశముంది. చేతికొచ్చే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తమను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అసాని తుఫాన్ ప్రభావంపై సీఎం జగన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కూడా స్వీయ జాగ్రత్తలు పాటించాలని, బయటకు రాకుండా ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు సూచించారు.

# మాజీ మంత్రి నారాయణకు బెయిల్ మంజూరు



చిత్తూరు,ప్రజాపాలన ప్రతినిధి : ఏపీ మాజీ మంత్రి నారాయణకు బెయిల్ లభించింది. వ్యక్తిగత పూచీకత్తుతో మెజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేశారు. రూ.లక్ష చొప్పున ఇద్దరు జామీను ఇవ్వాలని మెజిస్ట్రేట్ తెలిపింది. టెన్త్ పరీక్షల ప్రశ్నపత్రాల లీక్ కేసులో నారాయణను మంగళవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి చిత్తూరు తరలించిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి వైద్య పరీక్షల నిమిత్తం నారాయణను జిల్లా ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. అనంతరం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా..2014లోనే నారాయణ విద్యాసంస్థల చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు నారాయణ తరపు న్యాయవాదులు పేపర్లతో సహా ఆధారాలను న్యాయమూర్తికి చూపించారు. దీంతో పోలీసుల అభియోగాన్ని మెజిస్ట్రేట్ తోసిపుచ్చింది.

# ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో రూ.434 కోట్ల విలువైన 62 కిలోల హెరాయిన్ సీజ్!




న్యూఢిల్లీ,ప్రజాపాలన ప్రతినిధి : ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో రూ.434 కోట్ల విలువైన 62 కిలోల హెరాయిన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాలీ బ్యాగ్స్‌లో మాదక ద్రవ్యాలను నింపి అధికారుల కండ్లు కప్పి దేశంలోకి తరలించేందుకు డ్రగ్ మాఫియా ఆగడాలను డీఆర్ఐ సిబ్బంది భగ్నం చేసింది. భారత్‌లో కొరియర్, కార్గో, ఎయిర్ ప్యాసెంజర్ మార్గాల్లో హెరాయిన్‌ను భారీస్థాయిలో సీజ్ చేయడం ఇదే తొలిసారని ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ దాడుల్లో రాబట్టిన సమాచారం ఆధారంగా పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోనూ మరో ఏడు కిలో హెరాయిన్ రూ.50 లక్షల నగదు పట్టుబడింది. పట్టుబడిన 62 కిలోల హెరాయిన్ విలువ మార్కెట్‌లో రూ 434 కోట్లు ఉంటుందని అంచనా. ఇక కన్‌సైన్‌మెంట్ దిగుమతిదారును డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# తీవ్ర సంక్షోభంలో రైతాంగం.. అన్నదాతలకు అండగా తెలుగుదేశం



అమరావతి,ప్రజాపాలన ప్రతినిధి : వైకాపా పాలనలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతుండగా.. మరోవైపు ప్రకృతి వైపరీత్యాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు అన్నదాతలకు అండగా నిలిచేందుకు రైతు కోసం తెలుగుదేశం పేరుతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీ అకాల వర్షాలతో పంట నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతుందని తెలిపారు. రైతులు అప్పులు, పండించిన పంటకు సరైన ధర లభించక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నిత్యం ఇద్దరు, ముగ్గురు రైతులు బలవన్మారణాలకు పాల్పడుతున్న పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడో స్థానంలో ఉందని కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో నిలబడిందని దీంతోనే వ్యవసాయ రంగంపై వైకాపాకు ఉన్న నిబద్ధతను, నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రైతు కోసం తెలుగుదేశం కమిటీ అన్నదాతలకు అండగా నిలిచి వారికి పరిహారం అందేలా పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ కమిటీలో సభ్యులుగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాలవ శ్రీనివాసులు, పత్తిపాటి పుల్లారావు, జ్యోతుల నెహ్రూ, ధూళిపాళ్ల నరేంద్ర, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, కూన రవికుమార్, తెలుగురైతు విభాగం అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఉంటారని అచ్చెన్నాయుడు వెల్లడించారు.

ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం
వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

# జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

మచిలీపట్నం : వేం 11 ప్రజాపాలన :కృష్ణా జిల్లా పరిషత్ స్థాయి సంఘం సమావేశాలు బుధవారం జిల్లా పరిషత్ లో నిర్వహించారు. ప్లానింగ్ మరియు ఆర్థికం, గ్రామీణాభివృద్ధి, విద్య మరియు వైద్యం మరియుపనులు అంశాల పైన 1వ, 2వ, 4వ, 7వ స్థాయి సంఘ సమావేశాలు కృష్ణా జిల్లా చైర్ పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన నిర్వహించగా, వ్యవసాయం అంశం పై 3వ స్థాయి సంఘ సమావేశానికి వైస్ చైర్ పర్సన్ గరికపాటి శ్రీదేవి అధ్యక్షతన, సాంఘిక సంక్షేమం అంశం పై 6వ స్థాయి సంఘ సమావేశానికి వైస్ చైర్ పర్సన్



గుడిమళ్ల కృష్ణంరాజు అధ్యక్షతన, స్త్రీ సంక్షేమ మరియు రక్షణ అంశం పై 5వ స్థాయి సంఘ సమావేశానికి ఉంగుటూరు జడ్ పీటీసీ శ్రీమతి దుట్టా సీతారామలక్ష్మీ అధ్యక్షత వహించారు.తొలుత నిర్వహించిన గ్రామీణాభివృద్ధి పై 2వ స్థాయి సంఘ సమావేశంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ గౌరవ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ గడప గడపకు చేరేలా శ్రమించాలన్నారు. స్త్రీ సంక్షేమం, రక్షణ అంశంపై నిర్వహించిన 5వ స్థాయి సంఘ సమావేశంలోమహిళలు, ఆడ పిల్లల అట్రాసిటీ కేసుల పట్ల దృష్టి సారించాలని, ఈవ్ టీజింగ్ నిరోధానికి 1098,100, దిశ యాప్ హెల్ప్ లైన్ల ను పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్ల లో ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని మావేశానికి అధ్యక్షత వహించిన ఉంగుటూరుజడ్ పీటీసీ సభ్యులు శ్రీమతి దుట్టా సీతారామలక్ష్మీ అధికారులకు సూచించారు.వృద్ధాప్య, వితంతు పెన్షన్లు పొందడానికి లబ్దిదారులను సచివాలయాల్లో కులధృవీ కరణపత్రాలు అడుగుతున్నారని సభ్యులైన జడ్ పిటిసిలు 6వ స్థాయి సంఘ సమావేశంలో అధ్యక్షత వహించిన వైస్ ఛైర్ పర్సన్ గుడిమళ్ల కృష్ణంరాజు దృష్టికి తీసుకురాగా దీనిపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరి సచివాలయాలకు అందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయలన్నారు.తొలుత ఈ సమావేశాల్లో పాల్గొన్న జడ్ పి సిఇఓ వి.ఎన్ సూర్యప్రకాశరావు వివిధఅంశాలపై నిర్వహిస్తున్న స్థాయి సంఘ సమావేశాల్లో చర్చించే అంశాలు సభ్యులకు వివరించారు.ఈ సమావేశాల్లో ఆయా స్థాయి సంఘాల్లో సభ్యులైన జడ్ పీటీ సీలు, వివిధ శాఖల అధి, కా ం ల ం పాల్గొన్నారు.

## చేబ్రోలు పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు

పొన్నూరు మే11( ప్రజా పాలన ప్రతినిధి) :గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం గరువుపాలెం కి చెందిన 17 ఏళ్ల యువతి బోత్తెం పల్లి రమ్య బుధవారం ఉదయం తెనాలి లో సెయింట్ పీటర్స్ కాలేజీ కి అని చెప్పి వెళ్లి ఇంతవరకు తిరిగి ఇంటికి రాలేదని తల్లి బొత్తెంపల్లి కుమారి చేబ్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని చేబ్రోలు %ూ×% వై. సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి అధికారి విధిగా పని చేయాలి: స్పెషల్ కలెక్టర్ వినాయకం



పొన్నూరు మే11( ప్రజా పాలన ప్రతినిధి) నియోజకవర్గం లొ ప్రతి అధికారి విధిగా పనిచేసి ప్రభుత్వం తలపెట్టిన అన్ని కార్యక్రమాలు విజయవంతం చేయాలని స్పెషల్ కలెక్టర్ పొన్నూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఈ కె వినాయకం అన్నారు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన అధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు జగనన్న లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా కృషి చేయాలని కోరారు. వివిధ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేర్చాలని సూచించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఈనామ్ లో మనమే ముందు

కర్నూలు, మే 11, : ఈనామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్).. రైతులకు గిట్టుబాటు ధర, వ్యాపారులకు నాణ్యమైన సరుకు అందించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏకతాటిపైకి తీసుకొచ్చిన వేదిక. జాతీయస్థాయిలో వ్యాపారపరంగా గుంటూరు మార్కెట్ కమిటీ మొదటి స్థానంలో నిలవగా, ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఐదోస్థానంలో ఉంది. వేలంలో ఎక్కువమంది వ్యాపారులు పాల్గొన్నవాటిలో ఆదోని మార్కెట్ మొదటిస్థానంలో నిలిచింది.ప్రభుత్వ ప్రోత్సాహం, మౌలిక వసతుల కల్పన ఫలితంగా ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రైతులు, జాతీయస్థాయిలో వ్యాపారులు ఏపీ మార్కెట్ల ద్వారా క్రయవిక్రయాలకు పోటీ పడుతున్నారు. ఈనామ్ పరిధిలో జాతీయస్థాయిలో వెయ్యి మార్కెట్లు ఉండగా, రాష్ట్రంలో 33 మార్కెట్లు నమోదయ్యాయి. రాష్ట్రంలో 14.43 లక్షల మంది రైతులు, 3,469 మంది వ్యాపారులు, 2,285 మంది కమీషన్ ఏజెంట్లు ఈ?నామ్లో నమోదు చేసుకున్నారు. 194 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో రూ.29,701 కోట్ల విలువైన 51.73 లక్షల టన్నుల ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగాయి. ప్రధానంగా మిరప, పత్తి, పసుపు, నిమ్మ, టమాట, బెల్లం, ఆముదం, ఉల్లి, వివిధ రకాల పండ్లు, కూరగాయల క్రయవిక్రయాలు జరుగుతున్నాయిఈ?నామ్లో నమోదు చేసుకున్న రైతులు, వ్యాపారులు నేరుగా లేదా ఆన్లైన్లో దేశంలో ఎక్కడి నుంచైనా క్రయవిక్రయాలు చేయవచ్చు. అమ్మిన రోజునే రైతు ఖాతాకు సొమ్ము జమ అవుతుంది. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ల వల్ల తూకాల్లో మోసాలకు తావుండదు. తొలుత మార్కెట్కు రైతు తెచి?చన సరుకు వివరాలను నమోదు చేసుకుని, ఆ రైతు ఎంచుకున్న కమీషన్ ఏజెంట్ వద్దకు పంపిస్తారు. నాణ్యత పరీక్షా యంత్రాల (ఎస్సైయింగ్ ల్యాబ్స్) ద్వారా ర్యాండమ్గా లాట్స్ నాణ్యతను పరీక్షించి ఆన్లైన్లోనే పరిమాణంతో సహా ప్రదర్శిస్తారు. రహస్య బిడ్డింగ్ ద్వారా వ్యాపారులు కోట్చేసిన ధరల్లో అత్యధిక ధర, వ్యాపారి వివరాలను రైతుకు పంపిస్తారు. రైతు ఆ ధర నచ్చితే అమ్ముకోవచ్చు. లేదంటే తిరస్కరించవచ్చు.ఈ?నామ్ ద్వారా ఇప్పటివరకు జరిగిన వ్యాపారంలో రూ.20,985 కోట్ల విలువైన 26.45 లక్షల టన్నుల ఉత్పత్తుల క్రయవిక్రయాలు గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలోనే జరిగాయి. ఈ మార్కెట్కు వచ్చే మిర్చి కొనుగోలుకు పొరుగు రాష్ట్రాల వ్యాపారులు పోటీపడుతుంటారు. అత్యధిక మంది వ్యాపారులు పోటీపడుతున్న మార్కెట్గా ఆదోని మార్కెట్ మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ సగటున ఒక్కో లాట్కు 10?15 మంది పోటీ పడుతుండగా, సీజన్లో అత్యధికంగా 30?40 మంది కూడా పోటీపడిన సందర్భాలున్నాయి. ఇక్కడ ఇప్పటివరకు 9.36 లక్షల లాట్స్ కోసం 87.90 లక్షల బిడ్స్ దాఖలయ్యాయి. రూ.3,149 కోట్ల విలువైన 6.16 లక్షల టన్నుల క్రయవిక్రయాలతో ఆదోని వ్యాపారులు జోష్ గా సాగుతున్నారు

## రైతు భరోసా యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించిన బండి రామకృష్ణ

**జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి**




మచిలీపట్నం : వేం 11 ప్రజాపాలన :జనసేనపార్టీ అనుబంధం సంస్థ (టీం పిడికిలి)రూపొందించిన రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేస్తున్న రైతు భరోసా యాత్ర గోడ పత్రికను మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయం లో జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ ఆవిష్కరించారుఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అండగా జనసేన పార్టీ నిలిచిందని రాష్ట్ర వ్యాప్తంగా 3 వేలమందికి 30 కోట్ల రూపాయల సాయం జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అందజేస్తున్నారని మచిలీపట్నంజనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ అన్నారు రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న అన్నదాతల ప్రతి రైతు కుటుంబాన్నీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పరామర్శిస్తూ ,అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతుల కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నారని రాష్ట్రంలో రైతులు, కౌలు రైతులు పంట నష్టాలతో ఆత్మహత్యలు చేసుకోవడం ఆవేదనకు గురిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగరఅధ్యక్షుడు గడ్డంరాజు, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్,వడ్డీ చిరంజీవి, చలమలశెట్టి రమేష్, విన్నకోట శ్రీకాంత్, జన్ను నాగరాజు, మహమ్మద్ బాషి, కర్రి మహేష్,యశ్వంత్, తోటరాజేష్, వేములచక్రి, రామ్ జ్యోతి,నరసింహా వీరమహిళలు కుమారి,ఉషారాణి,సుగుణకుమారి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుఫాను పరిస్థితుల్లో ఏ ఒక్కరినీ సముద్రపు బీచ్ వద్దకు అనుమతించవద్దు: కలెక్టర్, ఎస్పీ

మచిలీపట్నం : మే 11 ప్రజాపాలన ప్రతినిధి : సముద్రపు బీ లోకి మత్స్యకారులతో పాటు సామాన్య జనాన్ని అనుమతించవద్దని జిల్లా కలెక్టర్పి.రంజిత్ బాషా, ఎస్పీ సిద్ధార్ద్ కౌశలు అధికారులకు సంయుక్త ఆదేశాలు జారీచేశారు.బుధవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ సిద్ధార్ద్ కౌశల్, జేసి రావిరాల మహేష్ కుమార్ లతోకలసి మచిలీపట్నంలోని రాడార్ కేంద్రాన్ని, మంగినపూడి బీచ్, తాళ్లపాలెం లోని తుఫాను రక్షణ భవనాలనుసందర్శించారు.తొలుత కలెక్టర్, ఎస్పీలు రాడార్ కేంద్రాన్ని పరిశీలించారు. రాడార్ కేంద్రంలో తుఫాను



ప్రభావితప్రాంతాల పరిస్థితిపై ప్రతి పదినిముషాలకోసారి రిపోర్ట్ వస్తుందని శాస్త్రవేత్త డా. ప్రైయాక చెప్పారు. చీరాలతీరప్రాంతానికి చేరి, తిరుగు ప్రయాణమై తుఫాను సముద్రములోకి సాగుతుందని ఆయన చెప్పారు.ప్రస్తుతానికి తుఫాను కదులుతూ ఉత్తర ప్రాంతమైన నరసాపూర్ కు దగ్గరలో చేరువైందని ఆయన వివరించారు.కృష్ణాజిల్లాలో ఒకమోస్తారు. వర్షాలు కురువవచ్చని ఆయన చెప్పారు. వర్షాలు కూడా అక్కడక్కడకచ్చన్నారు.రాడార్ కేంద్రాలు షార్, చెన్నై, మచిలీపట్నం తో పాటు మరో నాలుగు కేంద్రాల్లో ఉన్నాయనిఆయన నివేదించారు. కంప్యూటర్లలో చూసే విధంగా బ్లూ రంగు ఉన్న ప్రాంతం తక్కువ వర్షపాతాన్నిసూచిస్తుందన్నారు. అలాగే 'ఐ-బాల్ ప్రాంతానికి దగ్గరలో భారీ వర్షాన్ని సూచిస్తుందని కలెక్టర్,ఎస్పీలకు వివరించారు. అక్కడ నుండి నేరుగా కలెక్టర్ , ఎస్పీలు మంగినపూడి బీచ్ వద్ద తుఫాన్ పరిస్థితినిఅంచనా వేసేందుకు వెళ్లారు. సముద్రం అల్లకల్లోలంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమయంలో ఏఒక్కరినీ బీచ్ వద్దకు అనుమతించవద్దని మెరైన్, ఎఆర్ ఎఫ్ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. అక్కడి స్థానిక ప్రజలతో మాట్లాడుతూతుఫానుకు భయపడవద్దని, ప్రజలను ఆదుకొనేందుకు ప్రభుత్వం అండగా ఉందని భరోసా ఇచ్చారు.ప్రమాదకరం అనిపిస్తే వెంటనే తాళ్లపాలెంలోని పునరావాస శిబిరానికి చేరుకోవాలని అక్కడ మధ్యాహ్నం,రాత్రి భోజనాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారు.

## తుఫానులోను..., గడపగడపకు మనప్రభుత్వ కార్యక్రమం దిగ్విజయవంతం



చీరాల, మే 11, ప్రజాపాలన : ప్రజాదరణ ప్రజల అభిమానం ముందు అసని తుఫాను సైతం తల వంచింది. తుఫాన్ హెచ్చరికల నేప థ్యంలో ఇంటర్ పరీక్షలు రద్దయ్యాయి, వేటపాలెంలో తలపెట్టిన తెలుగుదేశం పార్టీ మీటింగ్ సైతం రద్దు అయ్యింది. వైఎస్సార్ సీపీ యువ నేత, చీరా ల వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం, తుఫాను లోను దిగ్వి జయవంతం కావటం గమనార్హం.చీరాల మండలంలో ఓ మారుమూలఉన్న పంచాయితీకి,అధిక సంఖ్యలో యువకులు ర్యాలీగా, జోరు వర్షం లోనూ తడుస్తూ, వెళ్లేందుకు ఉత్సాహం చూపడం, వెంకటేష్ బాబు పట్ల ఉన్న ఆదరణను వెల్లడి చేస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, చీరాల నియోజకవర్గంలో, నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో,చీరాల మండలం దేవినూతల గ్రామంలో, మొదలైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన, నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబుకి, మహిళలు గ్రామ పెద్దలు, పూలజల్లు కురిపిస్తూ,అపూర్వ స్వాగతం పలికారు.మొదటిగా గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి, తదుపరి గ్రామంలో గడప గడపకి వెళ్లి, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, చీరాలమున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాస రావు, మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఇన్చార్జులు, దేవినూతల గ్రామ



నాయకులు వల్లు పద్మావతి, వాకా శివయ్య, మాజీ ఎంపిటిసి గవిని వెంకన్న, ఎంపీడీవో సాంబశివరావు, ఏ పి ఎం సుబ్బారావు, పంచా యతీ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు మరియు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కాలం చెల్లిన చట్టాలు ఇంకెన్నాళ్లు..?

(మొదటి పేజీ తరువాయి)

మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి స్వతంత్ర సమరయోధులు రాజద్రోహం కింద ఆనాడు శిక్ష అనుభవించారు. స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం గురించి ఉద్యమిస్తున్న వారిని ఈనాడు అదే చట్టం కింద నిర్బంధించడం సిగ్గుచేటు. ఎన్సీపీ అధ్యక్షులు శరద్ పవార్ ఈ చట్టం ఎత్తివేతకు అన్ని పార్టీలతో కార్యాచరణను ఆహ్వానిస్తున్నారు. కాంగ్రెస్ కూడా ఇందులో కలిసి రావాలని రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా మాతో జరిగిన చర్చల్లో ప్రతిపాదించడం జరిగింది. మావోయిస్టులే చర్చలకు సిద్ధమవుతున్నప్పుడు ఈ చట్టం మరింత కాలం చెల్లినది అని చెప్పక తప్పదు.చట్టం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని, ఈనాటి ప్రమాదాన్ని ముందే ఊహించిన కె.ఎం. మున్షీ లాంటివారు దీన్ని అత్యంత క్రూరమైన చట్టంగా అభివర్ణించారు. వ్యక్తి హక్కులను నిర్దాక్షిణ్యంగా అణిచివేసే ఈ చట్టం ప్రజా స్వామ్య మనుగడకు ప్రమాదకరమని రాజ్యాంగ సభలో మాట్లాడారు. ప్రతిపక్షం లేకుండా ప్రజాస్వామ్య మనుగడ ఉండదు. ప్రశ్న ప్రజాస్వామ్య ఉనికికి జీవగర్ర లాంటిది. పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కుల అణచివేతకు కారణమవుతున్న రాజద్రోహాన్ని భారత శిక్షా స్మృతి నుండి తొలగించాలని ఇప్పటికే అనేక కేసులు దాఖలయ్యాయి. ఈ ప్రయత్నంలో న్యాయవ్యవస్థ సఫలీకృతం అయితే భారత ప్రజలకు ఒక భరోసా లభించినట్లే. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా గొంతు విప్పవలసిన సమయం ఇది. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలే ఎన్నుకొనే ప్రజా ప్రభుత్వాలు ఏవైనా సరే ఈ సత్యం గ్రహించాలి. ప్రజాస్వామ్యం అంతిమసారం అదే. రాజ్యాంగ స్ఫూర్తి కూడా అదే.

## హై అలర్ట్‌గా ఉండాలి..

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని" సీఎం అన్నారు."తుపాను బాధితుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించండి. వారికి ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే ఆదుకోవాలి. పరిహారం ఇచ్చే విషయంలో ఎలాంటి సంకోచాలు పెట్టుకోవద్దు. సెంట్రల్ హెల్ప్ లైన్‌తో పాటు, జిల్లాల వారీగా హెల్ప్‌లైన్ నంబర్లు సమర్థవంతగా పనిచేసేలా చూడాలి. వచ్చే కాల్స్ పట్ల వెంటనే స్పందించండి. ఈ నంబర్లకు బాగా ప్రచారం కల్పించాలని" సీఎం పేర్కొన్నారు.

**ఆ జిల్లాల్లో భారీ వర్షాలు..**

అసని తుపాను ప్రభావంతో విశాఖ, తుర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాలలో భారీ వర్షాలు పడనున్నాయి. విశాఖపై అసని తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఏపీ తీర ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. తీర ప్రాంత మండలాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మత్స్యకారులను వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. మరోవైపు పలువురు మంత్రులు అసని తుపాను ప్రభారంపై ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

## రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక పూజలు



పర్చూరు, మే 11, ప్రజాపాలన : నిత్యావసరాల ధరల పెంపు, పెట్రోలు డీజిల్ పన్నుల పెంపు పేరుతో, ప్రజలను నానా ఇబ్బందులు పెడు తున్న,అరాచక పాలనను అంతమొందించు స్వామి అంటూ..తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు, స్వామి వారిని వేడుకున్నారు. నాగరాజుపల్లి గ్రామంలోని గంగాపార్వతి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవ స్థానంలో, ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరలో జరగనున్న మహానాడు కార్యక్రమం విజయవంతం కావాలని, సభ్యత్వ నమోదు ఎటువంటి ఆటంకాలు లేకుండా జరగాలని, రాబోయేఎన్నికలలో టిడిపి అఖండవిజయం సాధించి, చంద్రబాబు ముఖ్యమంత్రి అయి,ప్రజలను కష్టాల నుంచి గట్టెక్కించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా,ఆశీర్వదించాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**మచిలీపట్నం పరిధిలోని రెండు సెంటర్లో తుఫాన్ ప్రభావం కారణంగా భారీ వర్షంవల్ల చెట్టు నేల కొరికింది. తక్షణమే స్పందించిన రెవెన్యూ సిబ్బంది ఆ యొక్క వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్ని క్రమబద్ధీకరణ చేశారు.**

# మాజీ మంత్రి నారాయణపై అక్రమ కేసును తీవ్రంగా ఖండించిన టీడీపీ నాయకులు

సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి : చంద్రబాబు నాయుడు గారిపై అక్రమ కేసు నమోదు పోలీసుల అధికార దుర్వినియోగం, చంద్రబాబుపై బురదచల్లే ప్రయత్నం జగన్ రెడ్డి ప్రభుత్వం దిగజారుడు చర్య, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించే అధికారం ఈ ప్రభుత్వానికి లేదు, ఈ కేసు చెల్లదు, ప్రభుత్వ నైతిక బాధ్యత వహించి తప్పుకోవాలి వైకాపా అధికారంలోకి వచ్చి 3 సంవత్సారాలు నిండిన ఇంకా తప్పుడు కేసులు అక్రమ అరెస్టులతో ప్రతిపక్ష తెలుగుదేశంపార్టీ నాయకులపై అరాచకం కొనసాగుతూనే ఉంది, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ని పావుగా వాడుకుంటూ రాజధాని నిర్మాణాన్ని గాలికి వదిలి ఇంకా తప్పుడు రిపోర్టులు, సీఐడీ కేసులు అధికార దుర్వినియోగం కొనసాగించటం బాధాకరం 10 వ తరగతి పరీక్షా పేపరు నిజంగా లికైతే తక్షణమే సంబంధిత మంత్రి రాజీనామా చేయాలి, సదరు మంత్రి రాజీనామా చేయకపోతే ముఖ్యమంత్రి ఆ శాఖ మంత్రి నీ బర్తరఫ్ చేయించాలి ఆ విషయాన్ని గాలికి వదిలేసిన జగన్ రెడ్డి, ఈ కేసులో మాజీ మంత్రి నారాయణ అక్రమ అరెస్ట్ కక్ష సాధింపు చర్య మాత్రమేరాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను



ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై, ఉద్యోగులపై నిర్బంధ కాండకు రాష్ట్రంలో విషమించిన ఈ పరిస్థితిలో రాష్ట్రపతి పాలన విధించాలని యన్,టి,ఆర్, భవన్ లో నిర్వహించిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా తెలుగుదేశంపార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ పెద కరిముల్లా, పల్నాడు జిల్లా తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కమిటీ మాజీ అధ్యక్షుడు కంబాల వెంకటేశ్వరరావు, పభుత్వం ఆసుపత్రి కమిటీ మాజీ డైరెక్టర్ రాంబో బుడే, కోవెరపూడి పాలకేంద్రం అధ్యక్షులు యర్రా వెంకటేశ్వర రావు, పల్నాడు జిల్లా తెలుగుయువత కార్యదర్శి షేక్ మాదల ఖాసీం, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కేతావత్ పున్నయ్య నాయక్, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ చిన అబ్దుల్లా, పోతుగంటి నరసింహారావు బండారు నాగరాజు, స్టార్ సూబాని, షేక్ మీరా హుసేన్, షేక్ ముస్తఫా, %ఎ% మస్తాన్రావు, సయ్యద్ సైదా, దేవళ్ళ జగన్నాథం, జయ బాబు, చల్లా మస్తాన్రావు, యెలినేడి రామారావు, షేక్ బుడా, తదితరులు పాల్గొన్నారు

## జామియా మసీదు 2వ స్లాబ్ పనులను పరిశీలించిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట: మే 11.(ప్రజాపాలన ప్రతి నిధి):నరసరావుపేట పట్టణంలో నిర్మితమవు తున్న జామియా మసీదు 2వ స్లాబ్ పనులను శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. స్లాబ్ పనులు ఇవాళ పూర్తి చేస్తామని తెలిపారు. మిగిలి ఉన్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని భావిస్తున్నామని అన్నారు. మసీదు నిర్మాణానికి షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ ఖజావలి మాస్టారు చాలా కష్టపడుతున్నారని ప్రశంసించారు. 5,6 నెలల్లో మసీదును పూర్తి చేస్తామని గర్వంగా చెప్తున్నామని అన్నారు. ముస్లిం సోదరుల సహకారం అందించాలని కోరారు. అంజుమాన్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. షా దిఖనా రిపేర్లకు కూడా టెండర్లు పిలిచామని తెలిపారు. పనులు సంతృప్తిని ఇస్తున్నాయని.. అల్లా దీవెనలతో ముందుకు వెళ్తామని వివరించారు.

## వాసవి క్లబ్స్ వినుకొండ వారి నిర్వహణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి జయంతి సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పణ



వినుకొండ మే 11 (ప్రజాపాలన ప్రతినిధి) :వాసవి క్లబ్స్ వినుకొండ వారి నిర్వహణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి జయంతి సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పణ వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్చార్జ్ గజవల్లి నాగ పవన్ కుమార్ గారి నిర్వహణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిఅమ్మవారు జయంతి వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలుతెలియజేస్తూ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలు, గాజులు వాసవి క్లబ్ వనితా మరియు వాసవి క్లబ్ కపుల్స్ డిస్ట్రిక్ట్ ఇన్చార్జి పవన్ మొదలగు వారుసమర్పించడం జరిగినది. తదనంతరంఅమ్మవారు జయంతి సందర్భంగాపేదవారికి వాసవి క్లబ్ డిస్టిక్ ఇన్చార్జ్ గజవల్లి నాగ పవన్ కుమార్ ఉచిత దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సదావర్తి అధ్యక్షులు కృష్ణాంజనేయలు వాసవి క్లబ్ డిస్టిక్ ఇంచార్జ్ గజవల్లి. నాగ పవన్ కుమార్, డిస్టిక్ వైస్ గవర్నర్ కజ్జాయం విజయలక్ష్మి క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ కిరణ్ కుమార్, సువర్ణ లక్ష్మి జోన్ చైర్మన్నాగేశ్వరరావు ,చంద్రశేఖర్ వాసవి క్లబ్ సీనియర్ నాయకులులక్ష్మీనారాయణ ,పొత్తూరి రాము, అప్పల రాజా, దేసులక్ష్మీనారాయణ, సాంబశివరావు, కోటేశ్వరరావు, అనిల్వాసవి క్లబ్ వనిత అధ్యక్షులు దేవతి శైలజ, సెక్రెటరీ ధనలక్ష్మి ట్రెజరర్ లక్ష్మీ జయశ్రీ వాసవి క్లబ్ కపుల్స్ అధ్యక్షులు పేరూరి. కృష్ణారావు, వాసవి క్లబ్ అధ్యక్షులు కామిశెట్టి రత్నాకర్ వాసవి యూత్ అధ్యక్షులు పెరుమాళ్ళ వెంకటేష్ శ్రీ పోలేరమ్మ తల్లి సత్సంగం నిర్వాహకురాలుపద్మా ఆధ్వర్యంలోభక్తులు భజన పాటల తో కోలాటాలతో ఊరేగింపుగా వెల్లి అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది.

## బొందలపాటి చెన్నమ్మను హాస్పటల్ లో పరామర్శ



నరసరావుపేట.మే 11 (ప్రజాపాలన ప్రతినిధి): ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం మిరియంపల్లి గ్రామం నకు చెందిన బొల్లెపల్లి విష్ణు అనే అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన మాల సామాజిక వర్గానికి చెందిన బొందలపాటి చెన్నమ్మ 39 సం. బొందలపాటి ప్రేమానందం కు చెందిన కౌలు పొలంలో గేదెలు మేపుతుండగా ఇదేమని ప్రశ్నించిన చెన్నమ్మను కర్రతో కొట్టగా కింద పడిపోయిన చెన్నమ్మపైన కూర్చొని కులం పేరుతో దూషిస్తూ తలపై కొడవలితో దాడిచేయగా స్పృహను కోల్పోయి రక్తపు మడుగులో ఉన్న చెన్నమ్మ సమాచారం పక్క చేలోనున్న కొణిదెల రాము చెన్నమ్మ బంధువులకు ఫోన్ చేయగా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు త్రిపురాంతకంలోని ప్రభుత్వాసుపత్రి వద్దకు చెన్నమ్మను 108లో తీసుకెళ్ళగా అక్కడ వైద్యులు చెన్నమ్మ ఆరోగ్య పరిస్థితిని చూసి ఆమెకు అక్కడ వైద్యం అందించడం కుదరదని చెప్పడంతో ఆమెను మెరుగైన అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని శేషాద్రి హాస్పటల్ కు తీసుకురావడం జరిగిందని కుటుంబసభ్యులు దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గోదా రమేష్ కుమార్ కు వివరించగా హాస్పటల్ వైద్యులతో చెన్నమ్మ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులతో మాట్లాడిన రమేష్ కుమార్ బాధితురాలికి న్యాయం జరిగేవరకు నిందితునికి శిక్షపడేవరకు బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఘటనపై రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులు కె.బసవరావు గారితో మాట్లాడటం జరిగిందని ఎస్సీ కమీషన్ సభ్యులు బసవరావు గారు బాధిత మహిళను పరామర్శిస్తారని రమేష్ కుమార్ తెలిపారు.

## రైతులు,ప్రజలు,ప్రజా ప్రతినిధులు కలెక్టర్లకు మెమోరాండం ఇవ్వకూడదా!

### మేము తీవ్ర వాదులమా!: జివి.ఆంజనేయులు



పల్నాడు జిల్లా. నరసరావుపేట.మే 11.(ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట పార్లమెంట్ పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జివి.ఆంజనేయులు బుధవారం నరసరావుపేట స్థానిక ప్రకాష్ నగర్ లోని తన ఇంట్లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రైతు సమస్యల పై కలెక్టర్ కి మెమోరండం ఇవ్వాలని పల్నాడు జిల్లా తెలుగు రైతు ఆధ్వర్యంలో పిలుపునిచ్చినందుకు.తనతో పాటు ఆయా నియోజకవర్గాల ఇంఛార్జులను హౌస్ అరెస్ట్ లు చేయటం ఎంత వరకు సమంజసం అన్నారు.రైతుల సమస్యలపై కలెక్టర్లకి మెమోరండం ఇవ్వకుండా అరెస్టులు చేయడం దారుణమన్నారు రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రజ సమస్యల గురించి కలెక్టరకు మెమోరండం ఇవ్వకూడదా, మేము ఏమైనా తీవ్రవాదులమా అని జగన్ ప్రభుత్వం పై ఘాటుగా విమర్సించారు. ఒక్క సారి ఛాన్స్ ఇవ్వమని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వ పాలన చూస్తుంటే బహుశా ఈ నలభై ఏళ్లలో ఇలాంటి ప్రభుత్వాలని ఎప్పుడు, ఎవరు చూడలేదన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను గొంతు నొక్కుతు,రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కు అడ్డుకోవటం చట్ట వ్యతిరేక చర్యలన్నారు. వైసిపి ప్రభుత్వం సాగిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని,రైతులను నట్టేట ముంచిన అసమర్థ ప్రభుత్వమని, అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యలు చేసుకున్న రైతులు, కౌలు రైతుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించి బాధిత రైతాంగానికి పరిహారం చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధన్ బాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోసూరి వీర రాఘవులు, జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు రావెళ్ల లక్ష్మీ నారాయణ, మైనార్టీ నాయకులు రఫీ, వినుకొండ నియోజకవర్గ నాయకులు గోనుగుంట్ల శ్రీనివాసరావు, గొప్పురి వీరాంజనేయులు, పాంగోటి రామాంజనేయులు, కోడూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సేవా భావం ఉన్న నాయకుడు అరవింద బాబు

### గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



నరసరావుపేట.మే 11.(ప్రజాపాలన ప్రతినిధి) :చదలవాడ అరవింద బాబు లాంటి నాయకుడు దొరకటం నరసరావుపేట పట్టణ ప్రజల అదృష్టమని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇంచార్జ్ అశోక్ రెడ్డి అన్నారు.గుంటూరు జిల్లా లినర్సరావుపేటలి పట్టణంలో లిఅమూల్య హాస్పిటల్లి అధినేత నరసరావుపేట టీడీపీ ఇంచార్జ్ లిచదలవాడ అరవింద్ బాబులి ని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే లిముత్తుముల అశోక్ రెడ్డిలి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు ప్రకాశంజిల్లా ప్రజలకు మరి ముఖ్యంగా గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రజలకు ఇతర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించటం చాలా అభినందనీయం అన్నారు అలాగే పేద ప్రజలకు మీ సేవలు చాలా అవసరమని అదే విధంగా మీ లాంటి సేవా దృక్పథం ఉన్న వ్యక్తులు నర్సరావుపేట రాజకీయాల్లో టీడీపీ ఇంచార్జ్ గా ఉండటం స్థానిక ప్రజల అదృష్టం అన్నారు రాబోవు రోజుల్లో ప్రజా ప్రతినిధిగా మరిన్ని సేవలందించాలని వారికి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కు విచ్చేసిన ముత్తుముల అశోక్ రెడ్డి ని డాక్టర్ అరవింద్ బాబు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షులు లిగోనుగుంట్ల కోటేశ్వరరావులి మర్యాదపూర్వకంగా సన్మానించారు.అనంతరం హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్న గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన పలువురిని పరామర్శించారు..

## ప్రారంభోత్సవంలో పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట.మే11.(ప్రజాపాలన ప్రతినిధి):నరసరావుపేట పట్టణంలోని శ్రీరాంపురంలో విరాట్ విశ్వ బ్రహ్మణ సంఘ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు ఇన్చార్జ్ వీఎస్పీ సాంబ , షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ ఖాజావలి మాస్టర్ , ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామి మాస్టర్ , బీసీ సెల్ నాయకులు వేముల శివ , వాసు , విష్ణు తదితర విశ్వ బ్రహ్మణ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |
| 15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్ను సంప్రదించగలరు
మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

ప్రజాపాలన


సంపాదకీయం

గురువారం 12, మే 2022

## ఇది రావణ కాష్ఠం

లంక తగలబడుతోంది. ఆంజనేయుడి తోకకు అంటించిన నిప్పు ఆనాటి లంకాదహనానికి దారి తీస్తే, ఇప్పుడు కట్టలు తెగిన ప్రజాగ్రహం ఆ పని చేస్తోంది. అప్పుడైనా, ఇప్పుడైనా పాలకుల పాపమే శాపమై ఆ దేశాన్ని దహిస్తోంది. అనేక వారాల ఆందోళనలు హింసారూపం దాల్చడంతో ప్రధానమంత్రి పదవి నుంచి అన్నయ్య మహింద సోమవారం పక్కకు తప్పుకున్నారు.తమ్ముడు గొటబయ రాజపక్స దేశాధ్యక్ష పీఠాన్ని పట్టుకొని వేలాడుతున్నారు. నెలరోజుల్లో రెండోసారి దేశంలో ఎమర్జెన్సీ. అన్నిటికీ కొరత. కర్ఫ్యూ ఉన్నా వీధుల్లో నిరసనకారులు. సోమవారం నాటి ఘర్షణల్లో ఒక పార్లమెంట్ సభ్యుడితో సహా కనీసం ఎనిమిది మంది మరణం. 225 మందికి పైగా గాయాలు. మంగళవారం రాజపక్సీయులు హెలికాప్టర్‌లో పారిపోవడం. ఇవన్నీ చూస్తుంటే శ్రీలంక ఆర్థిక సంక్షోభం నుంచి పూర్తిగా రాజకీయ సంక్షోభంలోకి జారిపోయిందని అర్థమవుతోంది. హింసాకాండ, రక్తపాతం శ్రీలంకకు కొత్త కావు. కానీ, పౌర సమాజంలో ఇప్పుడు చూస్తున్నంత ఆగ్రహం, హింస మునుపెన్నడూ చూడనివి. గత నెలన్నర పరిణామాలు, సమాజంలోని అనిశ్చితి, ప్రస్తుతం పాలనే లేని పరిస్థితులు చూస్తుంటే హిందూ మహాసముద్రంలోని ఈ బుద్ధభూమి అంత ర్యుద్ధం దిశగా సాగుతోందా అని ఆందోళన కలుగుతుంది. మహిందా ఇల్లు, వారి పూర్వీకుల గృహం సహా మాజీ మంత్రుల నివాసాలు జనాగ్రహంలో దగ్ధమైన తీరు చూస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.దేశవ్యాప్త కర్ఫ్యూను ఉల్లంఘించి మరీ, లగ్జరీ, స్పోర్ట్స్ కార్లతో సహా వాహనాలను నిరసనకారులు ధ్వంసం చేశారు. ప్రతిపక్ష నేతలు సైతం వారి ఆగ్రహం నుంచి తప్పించుకోలేకపోయారు. విధ్వంసానికి పాల్పడుతున్న ప్రదర్శనకారుల్ని కట్టడి చేయలేక చివరకు మంగళవారం నాడు రక్షణ శాఖ కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేసిందంటే ద్వీపదేశంలోని పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇటు శాంతిభద్రతల సమస్య, అటు ప్రభుత్వమే లేని పాలనతో రాజకీయ సంక్షోభం వెరసి శ్రీలంకది చిత్రమైన పరిస్థితి. కనీసం మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటుతో తాత్కాలికంగా పరిస్థితుల్ని చక్కదిద్దే ప్రయత్నమొక్కటే ఇప్పటికిప్పుడు కనిపిస్తున్న దారి. ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)తో దీర్ఘకాలిక ఆర్థిక వెసులుబాటు కోసం ఈ ద్వీపదేశం ప్రయత్నిస్తున్న వేళ అది మరీ ముఖ్యం.రాబోయే కొద్ది రోజుల్లో శ్రీలంక పార్లమెంట్ సభ్యులు సమావేశ మవుతారా, దేశానికి గండం గట్టెక్కడానికి అఖిలపక్ష ప్రభుత్వం ఏర్పాటు చేస్తారా, సైన్యాన్నీ పోలీసులనూ నమ్ముకున్న అధ్యక్షుడు గొటబయ రాజపక్స ఆ ప్రక్రియకు సహకరిస్తారా అన్నది వేచిచూడాలి. దేశ ప్రధాని నివాసం దగ్గరలఈ అత్యున్నత స్థాయికి చెందిన సీనియర్ మోస్ట్ పోలీసు అధికారిపై ఆగ్రహోదగ్ర జనం భౌతిక దాడికి దిగిన తీరు చూస్తే వెంటనే ఆపద్ధర్మ ప్రభుత్వం పగ్గాలు చేతబట్టి, పరిస్థితులను చక్కదిద్దకపోతే ఈ పౌర సంక్షోభం పూర్తిగా చేయి దాటిపోయే ప్రమాదమైతే ఉంది.వీటన్నిటికీ మూలమైన ఆర్థిక సంక్షోభం అతి పెద్ద సమస్య. పెరుగుతున్న ధరలు, పడిపోతున్న వ్యవసాయ ఉత్పత్తులు, శూన్యమైన పర్యాటక ఆదాయంతో శ్రీలంక పీకలలోతు కష్టాల్లో ఉంది. రాజకీయ సంక్షోభం మాటెలా ఉన్నా, ఈ ఆర్థిక సంక్షోభం ఇప్పుడప్పుడే పరిష్కార మయ్యేది కాదు. పేరుకుపోయిన వందల కోట్ల డాలర్ల అప్పు తీరేదీ కాదు.ఈ చిన్ని ద్వీపదేశం రాగల కొన్నేళ్ళలో ఏకంగా 5 వేల కోట్ల డాలర్లకు పైగా అప్పులు తీర్చాల్సిన తరుణంలో ఇప్పుడు కావాల్సింది దూరదృష్టి, దీర్ఘకాలిక పరిష్కారం. దేశంలో కరవు, ఆహార కొరత రాకుండా అడ్డుకట్ట వేయాలంటే ఆర్థిక విధానాలను సమూలంగా ప్రక్షాళన చేయడమే మార్గమంటున్నారు ఆర్థికవేత్తలు. ఉప్పు నిప్పుగా ఉండే సింహళీయులు, తమిళులు ఇప్పుడు రాజపక్సీయుల పాలనను వ్యతిరేకించడంలో అనూహ్యంగా ఒక్కటైనట్టే, చట్టసభలోనూ కలసి ముందుకు సాగడం ఈ గడ్డుకాలంలో ముఖ్యం. చిత్రమేమిటంటే చాలాకాలంగా శ్రీలంక, దాని పాలకులు చైనాతో చేతులు కలుపుకొని తిరిగినా, కరెన్సీ కష్టాల వేళ ఆ దేశం లంకేయుల వైపు కన్నెత్తి చూడకపోవడం! భారతదేశమే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో అంతా కలిపి 300 కోట్ల డాలర్ల మేర సింహళీయులకు సాయం చేసింది. మన ఆర్థిక మంత్రి అమెరికాలో సైతం శ్రీలంకకు నిధులు అందించాలంటూ ఐఎంఎఫ్ లాంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను అభ్యర్థించారు. సిలోన్‌ను కేవలం పొరుగుదేశంగానే కాక హిందూ మహాసముద్రంలో శాంతి, సుస్థిరతలకు కీలక భాగస్వామిగా భారత్ చూస్తోంది. గతంలో శ్రీలంక త్రాసు చైనా వైపు మొగ్గడంతో నష్టపడ్డ భారత్ పోయిన పట్టు మళ్ళీ సాధించుకుంటోంది. రాజపక్సీయుల సంగతికొస్తే, గతంలో ఒకటికి రెండుసార్లు ఎన్నికల్లో మట్టికరిచినా, మళ్ళీ పైకి లేచిన సత్తా ఆ కుటుంబానిది. కానీ ఈసారి కుటుంబ పాలనతో కూడబెట్టిన అవినీతి, సంపాదించిన అపకీర్తి చూస్తే వారు ఇక అధికారాన్ని మర్చిపోవాల్సిందే. దేశాధ్యక్షుడు గొటబయ మాత్రం పెల్లుబుకుతున్న ప్రజాగ్రహాన్ని సైనికబలంతో అణిచివేయాలని దింపుడుకళ్ళెం ఆశతో ఉన్నారు.ఎల్టీటీఈ అణచివేతలో పాత్రధారిగా, నిరంకుశ 'టెర్మినేటర్' పేరుపడ్డ ఆయన ఆ పట్టుతో కిరీటం కాపాడు కోవాలని శతవిధాల యత్నిస్తున్నారు. అయితే, సంక్షుభిత సింహళాన్ని సొంతకాళ్ళపై నిలబెట్టడం, ఆయన తన పీఠాన్ని నిలబెట్టుకోవడం రెండూ ఇప్పుడు కష్టమే! 1930ల తర్వాత ఎన్నడూ లేని ఆర్థిక సంక్షోభం, 1953 నాటి మహా హర్తాళ్ తర్వాత మళ్ళీ అంతటి నిరసనల్లో చిక్కుబడ్డ శ్రీలంకలో కొన్నేళ్ళపాటు ఈ రావణకాష్ఠం కాలుతూనే ఉంటుందనేది నిపుణులు చెబుతున్న నిష్ఠురసత్యం.

# పోలీసులు ఎవరికోసం పనిచేస్తున్నారు?




అయోధ్యలో కల్యాణ్ సింగ్ హయాంలో పోలీసు డైరెక్టర్ జనరలుగా ఉన్న ప్రకాశ్ సింగ్‌ను ఉన్నట్లుండి ఒకరోజు పదవి నుంచి తొలగించారు. అప్పటివరకూ అంతా బాగానే ఉన్నది. రాష్ట్రంలో మాఫియాని, ఉగ్రవాదాన్ని ఏరి వేస్తున్నందుకు ప్రకాశ్ సింగ్ మంచి పేరు సంపాదించుకున్నారు. కాని అయోధ్యలో వివాదాస్పద కట్టడం చుట్టూ ఉన్న భద్రతను సడలించమని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఆయన ప్రతిఘటించారు. 'అయోధ్యలో రామమందిరం కట్టాలని నా మనసు కోరుకుంటుంది కాని రాష్ట్ర పోలీసు అధికారిగా చట్టపరమైన పాలనే నాకు అన్నిటికన్నా గొప్ప మతం' అని ఆయన అన్నారు. ప్రతి బారికేడ్ తొలగింపునూ ఆయన అడ్డుకునే ప్రయత్నం చేశారు. చివరకు ఆయననే తొలగించారు. న్యాయవ్యవస్థ ఆదేశాలను అమలు చేసేందుకు, చట్టపరమైన పాలనను అమలు చేసేందుకు కట్టుబడిన ఒక పోలీసు అధికారిని నిర్దాక్షిణ్యంగా తొలగించడం ఏం చెబుతుంది? వ్యవస్థల్లో సమగ్రమైన మార్పు రావడం తప్పనిసరి అని చెప్పడం లేదా? అని ప్రకాశ్ సింగ్ ప్రశ్నించారు.దేశంలో పోలీసు వ్యవస్థలో సంస్కరణలు జరగాలని కొన్ని దశాబ్దాలుగా సుప్రీంకోర్టులోనూ, ఇతర వేదికల్లోనూ పోరాడుతున్న ఇదే ప్రకాశ్ సింగ్ రాసిన 'ద స్ట్రగుల్ ఫర్ పోలీస్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా' పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆదివారం ఢిల్లీలో ఆవిష్కరించారు. ప్రగతిశీల, ఆధునిక భారతదేశంలో ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థలో సంస్కరణలు రావాలని, కాని స్వాతంత్ర్యం నుంచి ఇప్పటివరకూ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని ఉపరాష్ట్రపతి అన్నారు. 1857 తర్వాత బ్రిటిష్ పాలకులు తమ సామ్రాజ్యవాద ప్రయోజనాలకోసం ప్రవేశపెట్టిన పోలీసు వ్యవస్థను అదే మాదిరి ఇప్పటికీ ఉపయోగించుకోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఒక రాజ్యాంగాధినేత దేశంలో పోలీసు వ్యవస్థ దుస్థితి గురించి ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఎందుకు మన దేశంలో ఇంకా వలసవాద పోలీసింగ్ వ్యవస్థను కొనసాగిస్తున్నాం? స్వాతంత్ర్యం తర్వాత రాజకీయ నాయకులు ఈ వ్యవస్థను తమ స్వార్థపర, సంకుచిత ప్రయోజనాలకు అనుగుణంగా దుర్వినియోగం చేస్తున్నారని, తమ అధికారాన్ని కొనసాగించేందుకు బ్రిటిష్ కాలం నాటి ఆటవిక పోలీసు చట్టాలనే ప్రయోగిస్తున్నారనీ అందరికీ తెలుసు. కాలం చెల్లిన చట్టాలను రద్దు చేశామని, వలస కాలం నాటి రాజద్రోహ సెక్షన్‌ను కొనసాగించే విషయం పరిశీలిస్తామని తాజాగా సుప్రీంకోర్టులో చెప్పుకున్న మోదీ ప్రభుత్వం దేశంలో పోలీస్ వ్యవస్థలో సమూల మార్పులు చేసే విషయంలో ఏమైనా చేయగలదా, లేక బ్రిటిష్ కాలం నాటి 1861 పోలీసు చట్టాన్నే అవసరాలకు తగ్గట్లుగా మార్చుకుంటూ పోతుందా అన్నది చర్చించాల్సిన అవసరం ఉంది.'పనిముట్లను సవ్యంగా ఉపయోగించేవారు ఉండాలి కాని పనిముట్లతో పోరాడటం మంచిది కాదు. ఈ ఉపకరణాలను తొలగిస్తే దేశంలో కల్లోలం ఏర్పడుతుంది' అని మన తొలి హోంమంత్రి సర్దార్ పటేల్ భావించడంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 312 (2) అఖిలభారత సర్వీసులను పార్లమెంట్ ఏర్పాటు చేసింది. కాని ఆయన ఆలోచనలకు భిన్నంగా పరిస్థితులు మారిపోయాయి. స్వాతంత్ర్యం తర్వాత రాజకీయ నాయకులు, అధికారులను ప్రేరేపించిన ఆదర్శవాదం గాలికి కొట్టుకుపోయింది. అధికారవే రాజకీయ నేతలకు పరమార్థంగా మారింది. రాజకీయ నాయకులకు అధికారులకు అక్రమ అనుబంధం ఏర్పడింది. అధికారంలో ఎవరు ఉంటే వారికి తగ్గట్లుగా పరిపాలనా యంత్రాంగం కట్టుబడి పనిచేయాలనే భావాన్ని రాజకీయ నాయకత్వం అధికారుల మెదళ్లలో చొప్పించడం చాలా కాలం నుంచే దేశంలో ప్రారంభమైంది. అధికారుల్లోని నిజాయితీ, ప్రతిభ, పరిపాలనాపరమైన అర్హతలను పక్కనపెట్టి తమతో వ్యక్తిగత సంబంధాలు, సాన్నిహిత్యం, విధేయతకు ప్రాధాన్యం ఇవ్వడం మొదలైంది. ఎమర్జెన్సీ సమయంలో దీని దుష్పరిణామాలు తీవ్రతరమయ్యాయి. అప్పుడు పోలీసులు, మెజిస్ట్రేటులు కుమ్మక్కై ప్రజలకు కనీస స్వేచ్ఛను నిరాకరించారని, కోర్టు తలుపు తట్టకుండా జైళ్లలో వేశారని, కేవలం రాజకీయ అభిప్రాయాల ఆధారంగా ఎవర్ని అరెస్టు చేయాలో, ఎవర్ని విడుదల చేయాలో నిర్ణయించేవారని ఎమర్జెన్సీ తర్వాత జనతా ప్రభుత్వం నియమించిన షా కమిషన్ తన నివేదికలో పేర్కొంది. పోలీసులను రాజకీయాల నుంచి దూరం చేయాలని, చట్టపరమైన పాలన మాత్రమే వారు చేసేలా చూడాలని కమిషన్ సిఫారసు చేసింది. తమకు వేరే దారి లేక దారుణాలకు పాల్పడ్డామని అనేకమంది పోలీసు అధికారులు షా కమిషన్ ముందు మొరపెట్టుకున్నారు.

పోలీసులే నిర్వహించే బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కూడా పోలీసులపై రాజకీయ పెత్తనం అతిగా పెరిగిపోయిందని, చట్టపరమైన పాలనను కాలరాచేందుకు, నియంతృత్వాన్ని అమలుచేసేందుకు పోలీసులను ఉపయోగించుకుంటున్నారని 1979లోనే ఒక నివేదిక ప్రచురించింది. ప్రజాస్వామ్య పునాదులను ఇది దెబ్బతీస్తుందని హెచ్చరించింది. అయినా రాజకీయనేతల పర్యవేక్షణలో పోలీసుల దారుణాలు దేశంలో ఇంకా పెరిగాయే కాని తగ్గలేదు. ఇందుకు ఉదాహరణగా ప్రకాశ్ సింగ్ 1984 డిసెంబరు 31 సిక్కుల ఊచకోత నుంచి 2000లో గుజరాత్‌లో జరిగిన హింసాకాండ వరకు ఎన్నో ఘటనలను ఉదహరించారు.1994 సెప్టెంబరు 13న అలహాబాద్ హైకోర్టుపై జరిగిన దాడి, 1994 అక్టోబరులో ఉత్తరాఖండ్ ఉద్యమకారులపై అమలు అయిన దారుణాల నుంచి 2002లో గుజరాత్ అల్లర్ల వరకు మాత్రమే కాదు, దేశంలో ప్రతి రోజూ ప్రతి చోటా రాజకీయ వ్యవస్థతో పోలీసుల కుమ్మక్కు కనపడుతూనే ఉన్నది. గోధ్రా సంఘటన నుంచీ తర్వాత రెండు నెలల వరకూ గుజరాత్‌లో జరిగిన అల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని జాతీయ మానవ హక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ జెఎస్ వర్మ వ్యాఖ్యానించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసు సంస్కరణలను ఎలాంటి ఆలస్యం లేకుండా అమలు చేయాలని, దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగేలా చూడాలని ఆయన అన్నారు.పోలీసు సంస్కరణల కోసం రాష్ట్రాల స్థాయిల్లో దాదాపు 11 కమిషన్లను నియమించారు. వీటిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఐపీఎస్ అధికారి కె.రామచంద్రారెడ్డి కమిషన్ కూడా ఉన్నది. జాతీయ పోలీసు కమిషన్ 8 నివేదికలను సమర్పించింది. ఇవి కాక కేంద్ర స్థాయిలో గోరే, రిబేరియో, పద్మనాభయ్య, మాలిమత్ కమిటీలను, జాతీయ భద్రతపై మంత్రుల బృందాన్ని నియమించారు. 1996లో ప్రకాశ్ సింగ్ స్వయంగా పోలీసు సంస్కరణలపై సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సమర్పించారు. కొత్త పోలీసు చట్టాన్ని రూపొందించాలని, జాతీయ స్థాయిలోను, ప్రతి రాష్ట్రంలోనూ భద్రతా కమిషన్లను నియమించాలని, దర్యాప్తును, శాంతి భద్రతలను వేరు చేయాలని, పోలీసు అధికారులకు కనీస పదవీకాలం ఉండాలని ఆయన అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు రాష్ట్రాలకు నోటీసులు పంపి ఊరుకుంది. దాదాపు 9 సంవత్సరాలు ఏమీ జరగలేదు. 2005లో జస్టిస్ సబర్వాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యాక ఈ కేసుపై విచారణలో కదలిక ఏర్పడింది. చివరకు 2006 సెప్టెంబర్ 22న సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రకాశ్ సింగ్ తన పిటిషన్‌లో చేసిన అన్ని అభ్యర్థనలను అది అంగీకరించింది. భద్రతా కమిషన్, పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు, పోలీసులపై ఫిర్యాదుకులకు అథారిటీ, అధికారులకు కనీస పదవీ కాలం, శాంతి భద్రతల నుంచి దర్యాప్తును వేరు చేయడంపై ఆదేశాలు జారీ చేసింది. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఒక చరిత్రాత్మక మార్పు చట్టసభల ద్వారా కాకుండా న్యాయవ్యవస్థ ద్వారా జరగడం గొప్ప విషయమని, అధికార ప్రయోజనాలకు తగ్గట్లుగా పోలీసు వ్యవస్థ పనిచేయడం రాజకీయ చిత్తశుద్ధి లోపించడానికి నిదర్శనమని ఆనాడు ఒక ప్రముఖ దినపత్రికలో అజిత్ కే దోవల్ వ్యాసం రాశారు, ఆయన తర్వాతి కాలంలో జాతీయ భద్రతా సలహాదారు అయ్యారు. అది వేరే సంగతి.పోలీసు సంస్కరణల విషయంలో గత పదహారేళ్లుగా తన తీర్పు అమలు కాకపోవడాన్ని సుప్రీంకోర్టు కూడా నిస్సహాయంగా గమనిస్తూనే ఉన్నది. అనేక రాష్ట్రాలను కోర్టు ధిక్కరణకు పాల్పడ్డాయని నిందించిన తర్వాత కూడా జరిగిందేమీ లేకపోయింది. పోలీసులు అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తడం పెరుగుతూనే ఉన్నది కాని ఇంకా తగ్గడం లేదు. బుల్‌డోజర్లు పేదల ఇళ్లను కూల్చివేస్తుంటే పోలీసులు తోడ్పడటాలు, నేతల ఇష్టాయిష్టాల ప్రకారం ప్రత్యర్థులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లలో హింసించడాలూ జరుగుతూనే ఉన్నాయి. పోలీసు స్టేషన్లలో భౌతిక దాడులు జరుగుతున్నాయని ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కూడా ఒక సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. నార్వేలో కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు పోలీసులు తమ దేశ ప్రధానమంత్రి పైనే భారీ పెనాల్టీ విధిస్తే, మన దేశంలో ఇక్కడి పోలీసులు తమ లాఠీల ప్రతాపాన్ని వీధుల్లో అభాగ్యుల వీపులపై చూపించిన దృశ్యాలను మనం తిలకించాం.'అధికారులు, రాజ్యాంగానికి, చట్టాలకు విధేయంగా ఉండాలి కాని అధికార పార్టీ నేతలకు కాదు. వారు నేతల ప్రయోజనాన్ని కాదు, చట్టపరమైన న్యాయాన్ని కాపాడాలి. పాలకుల పోలీసులు కాదు, ప్రజల పోలీసులు కావాలి' అని ప్రకాశ్ సింగ్ అన్నారు. అది ఈ దేశంలో సాధ్యమా?

# శిక్షణనిచ్చాకే బండి కొనివ్వండి

చాలామంది తల్లిదండ్రులు గారాబంతో తమ పిల్లలకు ఖరీదైన బైకులు, కార్లు కొనిస్తున్నారు తప్ప వారికి సక్రమంగా డ్రైవింగ్ వచ్చా లేదా అనేది పరిగణనలోకి తీసుకోవడం లేదు. పిల్లలకు బైకులు కార్లు ఇచ్చే ముందు వారికి సుశిక్షితులైన వారి వద్ద డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించాలి. రహదారి భద్రతా నియమాలను పాటిస్తున్నారా లేదా స్వయంగా పర్యవేక్షించి, నిర్ధారించుకోవాలి. లైసెన్స్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యే వరకు ఆ పర్యవేక్షణను కొనసాగించాలి. ఆ తరువాత వారి సెల్ ఫోన్ డ్రైవింగ్ మీద ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలి, అవగాహన కల్పించాలి. ఇది తల్లిదండ్రుల బాధ్యత. అలాగే పిల్లలకు అధిక భద్రతా రేటింగ్ ఉన్న వాహనాలను మాత్రమే కొనివ్వాలి. రోడ్డు ప్రమాదాల్లో యువత తమ విలువైన ప్రాణాలను, లేదా శాశ్వతంగా అవయవాలను కోల్పోతోంది. ఇది వారి కుటుంబాల్లో తీవ్రమైన క్షోభను కలిగిస్తోంది. దీనికి ముఖ్య కారణం డ్రైవింగ్‌లో నైపుణ్యం లేకపోవడం. వాహన చోదకులు సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మత్తులో డ్రైవింగ్ చేస్తూ, అతివేగంగా వాహనం నడుపుతూ ప్రమాదాలకు కారణమవడమే కాకుండా, ఇతరుల కుటుంబాలో విషాదం నింపినవారవుతున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గుండెపోటు వచ్చినా ఒక ఆర్టీసీ డ్రైవర్ బస్సు వేగాన్ని నియంత్రిస్తూ ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన వార్తలు వింటూనే ఉన్నాం. అటువంటి వారిని ఆదర్శంగా చూపుతూ సురక్షితంగా ప్రయాణం చేసేలా చూడాలి.



## నివాళులు అర్పించిన పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్



పామర్రు,ప్రజాపాలన ప్రతినిధి మే11: తోట్లవల్లూరు మండలంలోని చాగంటిపాడు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ రెడ్డి తండ్రి అనారోగ్యంతో స్వర్గస్తులైనారు, వారి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్న పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులుకైలే అనిల్ కుమార్,కార్యక్రమంలో పాల్గొన్న పామర్రు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు..

## పొన్నూరు లో భారీ వర్షం



పొన్నూరు మే11( ప్రజా పాలన ప్రతినిధి) :అసని తుఫాను ప్రభావంతో బుధవారం పొన్నూరు పట్టణంలో భారీ వర్షం కురిసింది. భారీ వర్షం వలన పట్టణంలోని ప్రధాన రోడ్ల తో పాటు ఆయా వార్డుల్లో రోడ్లపై నీరు నిలిచింది. గత గురువారం నుంచి వర్ష ప్రభావం ఉండటం వలన జనజీవనం స్తంభించింది. తుఫాను ప్రభావం వలన ప్రజా రవాణా కు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

## చింతలపూడి జగనన్న కాలనీ లో పర్యటించిన అధికారులు



పొన్నూరు మే11( ప్రజా పాలన ప్రతినిధి) : పొన్నూరు మండలం చింతలపూడి గ్రామం జగనన్న కాలనీ లో బుధవారం పొన్నూరు ఇన్చార్జి తాసిల్దార్ షేక్ మహబూబ్ సుభాని, ఎంపీడీవో అత్తోట దీప్తి, హౌసింగ్ శాఖ అధికారులు పర్యటించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతంగా నిర్మించుకోవాలని సూచించారు. కాలనీ కి వెళ్లే ప్రధాన రహదారిని నిర్మించేందుకు అధికారులు వేగవంతంగా చర్యలు చేపట్టి లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా సమస్య ను పరిష్కరించాలని తాసిల్దార్ మహబూబ్ సుభాని సూచించారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని తాసిల్దార్ కోరారు. గ్రామంలో నూరు శాతం గృహాలను నిర్మించేందుకు అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. గ్రామ కార్యదర్శి జి ఆర్ డి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణ మిల్క్ యూనియన్ వారి కళ్యాణమస్తు పథకం



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి మే11:బాపులపాడు మండలం కొయ్యూరు సంఘము నందు పాలు పోస్తున్న కొల్లి వెంకట సత్యనారాయణ కుమార్తె సౌమ్య వివాహానికి కృష్ణ మిల్క్ యూనియన్ వారి కళ్యాణమస్తు పథకం కు అర్హత పొంది ఉన్నందున వారికి 20,000/- విలువగల నాలుగు గ్రాముల గోల్డ్ కాయిన్ ను చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదుగా బుధవారం అందజేయడం జరిగింది. అలాగే రంగన్న గూడెం సొసైటీ నందు అర్హత పొందిన తలారి కోటేశ్వరరావు కుమార్తె ఉషారాణి వివాహానికి కృష్ణ మిల్క్ యూనియన్ ద్వారా 20 వేల రూపాయలు విలువచేసే 4 బంగారు నాణేలను చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతులమీదుగా అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి హనుమాన్ జంక్షన్ కస్టర్ మేనేజర్ వీరమాచనేని విజయ సంపత్ కుమార్, కొయ్యూరు సొసైటీ అధ్యక్షులు కొల్లి రంగారావు, రంగన్న గూడెం సొసైటీ అధ్యక్షులు మొవ్వా శ్రీనివాసరావు, ఆళ్ళ వెంకట గోపాలకృష్ణ రావు, కసుకుర్తి అర్జునరావు,రూట్ సూపర్ వైజర్ పి.ప్రసాద్, వేతన కార్యదర్శులు గురవయ్య,శ్రీను, సంఘ పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ తమ ఇంట్లో వివాహ కార్యక్రమానికి జిల్లా యూనియన్ వారు గోల్డ్ కాయిన్స్ ఇచ్చినందుకు చైర్మన్ కు మరియు జిల్లా పాలక సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## టిడ్కో ఇళ్ల ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ జయరామ్



నందిగామ మే 11 ప్రజా పాలన ప్రతినిధి:హను మం తు పాలెం మునగ చర్ల పరిసర ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రాంతాన్ని మున్సిపల్ క మిషనర్ జ యరామ్ పరిశీలించారు. కేటాయించిన స్థలంలో త్వ రగా ప్రతి పేదవాడికి పక్కా గృహాన్ని నిర్మిం చాలని ఆ యన అన్నారు. గృహాల నిర్మాణం వేగవంతంగా జర గాలని ఆయన అన్నారు నిర్మాణం పూర్తి చేసు కున్న వారికి సకాలంలో బిల్లులు అందేలా చూస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు

## రైల్వేమంత్రికి, ఎంపీ రఘురామకు బండారు కృతజ్ఞతలు



నరసాపురం, మే 11 (ప్రజాపాలన ప్రతినిధి) : కోవిడ్ కారణంగా రద్దుచేసిన మచిలీపట్నం - నరసాపురం - విశాఖపట్నం లింక్ ప్యాసింజర్ రైలును ఎక్స్ ప్రెస్ రైలుగా మార్పుచేసి ఈ నెల 14వ తేదీ నుండి నడపనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించిన నేపథ్యంలో దీనికి కృషిచేసిన నర్సాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు, కేంద్ర రైల్వేశాఖ మంత్రులకు నర్సాపురం మాజీ శాసనసభ్యులు బండారు మాధవనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై బండారు మాధవనాయుడు మాట్లాడుతూ కోవిడ్ అనంతరం రద్దు చేసిన అన్ని రైళ్లను పునరుద్దరించినా విశాఖపట్టణం ప్యాసింజర్ రైలును మాత్రం పునరుద్ధరించికపోవడంతో నరసాపురం పరిసర ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను, దానితోపాటు స్థానిక చినమామిడిపల్లి రైల్వే గేటును శాశ్వతంగా మూసివేయడంతో ఆప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఏప్రిల్ 19 న ఎంపీ రఘురామకృష్ణంరాజుకు తాము వినతిపత్రం అందజేశామని తెలిపారు. దీనిపై ఎంపీ రఘురామకృష్ణంరాజు తక్షణమే స్పందించి కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారని దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఈనెల 14 నుండి మచిలీపట్నం - విశాఖపట్నం ఎక్స్ ప్రెస్ రైలుగా తిరిగి పట్టాలెక్కేలా చర్యలు తీసుకోవటం హర్షించదగ్గ విషయమని మాధవనాయుడు అన్నారు. ఈ ట్రైనుకు అనుసంధానంగా నరసాపురం నుండి భీమవరం వరకు డెమో రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మచిలీపట్టణం - విశాఖపట్నం రైలు తిరిగి పునరుద్ధరించేందుకు కృషిచేసి నరసాపురం పరిసర గ్రామాల ప్రజల ఇబ్బందులను తొలగించిన కేంద్ర రైల్వేశాఖ మంత్రికి, ఎంపి రఘురామకృష్ణంరాజుకు, మాజీ శాసనసభ్యులు బండారు మాధవనాయుడుకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ప్రతి గడపకు వైఎస్సార్ సంక్షేమ కార్యక్రమం



వత్సవాయి మే 11 ప్రజాపాలన ప్రతినిధి:రాష్ట్రంలో కుల, మత,వర్గ,పార్టీ లకు అతీతంగా సంక్షేమ పథ కా లు అందివ్వడం వైఎస్సార్ ప్రభుత్వానికే దక్కిందన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ నియోజకవర్గ శాసన సభ్యులు సామినేని. ఉదయభాను బుధవారం నియో జకవర్గ పరిధిలోని పోల్లంపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిన గడపగడపకు వైఎస్సార్ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు పై ప్రజల అభిప్రాయాలను స్వయంగా ఆడిగి తెలుసు కో వడం జరిగింది,ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ రాష్ట్రంలో ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయని వి ధంగా ఎన్నికల మ్యానిఫెస్టోని ఒక పవిత్ర గ్రంథం గా భావించి అందులోని ప్రతి హామీ ని తూచ తప్పకుం డా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ ప్రభు త్వం మాత్రమే అని, పిల్లలు నుంచి పండు ముసల మ్మ వరకు ఆనందంగా ఇంట్లో ఉంటే తమకు రావా ల్సిన తమ హక్కు గా పొందాల్సిన డబ్బులు స్వయం గా వాలంటీర్స్ తీసుకుని వచ్చి అందిస్తున్నారు అని, పిల్లలకు అమ్మ ఒడి,పెద్దలకు చేయూత, కాపు నేస్తం, అగ్రవర్ణ పేదలకు భరోసా, రైతులకు వాహన మిత్ర, రైతు భరోసా కేంద్రాలు, పెట్టుబడి సాయం,సబ్సిడీ ఎ రువులు, వింతనాలు, కార్మికుల కు చేదోడు ఇలా అ న్ని వర్గాల ప్రజలకు ఏదో ఒక రూపంలో మంచి చే యాలని తపించే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ మోహ న్ రెడ్డి గారని, ప్రజలకు మంచి జరుగుతుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారు అని, ప్రజల వద్ద కు నేరుగా వచ్చే ధైర్యం లేక అనేక సమస్యలు సృష్టి స్తు న్నారని, బాదుడే బాదుడు అనే చంద్రబాబు నా యుడు కేంద్ర ప్రభుత్వం బాదుడు మీద మాట్లాడే లే రని ఎందుకు అంటే రేపు పొత్తు లేనిదే పది సీట్లు కూ డా రావ్వేమో అనే భయం అని, ఇప్పుడు మన ప్రభు త్వం ప్రజల ప్రతి రూపాయి వారికే ఇస్తుంటే చంద్రబా బు నాయుడు ఆయన పార్టీ నేతల భాద ఏంటో అర్థం కావడం లేదని, గతంలో మాదిరిగా జేబులో వేసుకుని ప్రజల దగ్గర బాదకుండా వారి సోమ్ము వారికే ఎటువం టి దళారుల జేబులో కి పోకుండా అందివ్వడం జరు గుతుందని, ఏదైనా ప్రజలకు తమకు ఎవ్వరూ మంచి చేస్తారు, చేస్తున్నారు అనే సంగతి తెలుసు అని, ఈ రోజు ప్రతి గడపలో వారు చూపించే అభిమానం వాళ్ల కళ్ళల్లో కనబడే అప్యాయత చెప్తుంది వైఎస్సార్ ప్రభు త్వం ఏవిధంగా ప్రజల హృదయాలను గెలిచిందో అని తెలిపారు.

## రైతులను రారాజులుగా తీర్చిదిద్దడమే ఈ ప్రభుత్వ లక్ష్యం: ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



వత్సవాయి వే 11 ప్రజా పాలన ప్రతినిధి:మండలప రిధిలో పోలంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించే సొ సైటీ భవన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతి థిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ సామి నేని ఉ దయభాను మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశే?ఖరరెడ్డి రైతును రాజును చేస్తే, సీఎం వైఎ స్ జగన్‌మోహన్ రెడ్డి గారు రైతును రారాజును చేయ డానికి రైతు భరోసా పథకం ప్రవేశపెట్టారని,రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సహకార సంఘాలను తీర్చిదిద్ద డం చాలా సంతోషంగా ఉందని, ఎక్కడ లేనన్ని డిపా జిట్లు సేకరించి రైతుల శ్రేయస్సుకోసం పాటుపడటం అభినందనీయమని అలాగే క్యాష్ కౌంటర్, ఎరువుల, విత్తనాల కేంద్రాలు,ఏర్పాటు చేసి వాణిజ్య బ్యాంకు ల కు దీటుగా సహకార సంఘాన్నితీర్చిదిద్దడంరాష్ట్రానికే గర్వకారణమని అలాగే గోల్డ్ లోన్లు,దీర్ఘకాలిక రుణా లు ఇచ్చి రైతులను ఆపదలో అదుకొవడం శుభపరి ణామమని తెలియజేసారు.రాష్ట్రంలో మన ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి గారు ప్రతి గడపకు అనేక సంక్షేమ కార్యక్రమాలు వాలంటీర్ల సహాయంతో మీ గడపకు చేస్తున్నారని అలాగే పోలంపల్లి గ్రామంలో సుమారుగా అనేక ప్రభుత్వ పథకాల ద్వారా 14 కోట్ల 33 లక్షల 88వేల రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయబడుతున్నాయని తెలియజేశారు.

## ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోనేందుకు సిద్ధం



నరసాపురం, మే 11 (ప్రజాపాలన ప్రతినిధి) : అసని తుఫాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తీరప్రాంత, లోతట్టుప్రాంతాల్లో అధికారులు మకాంవేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనావేసి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జె.వి మురళి ఆదేశించారు. నరసాపురం మండలం చినమైనవానిలంక, పెదమైనవానిలంక, వేములదీవి, దర్భరేవు, రాజులలంక ప్రాంతాలలో సబ్ కలెక్టరు సి.విష్ణుచరణ్ తో కలసి బుధవారం జిల్లా జాయింట్ కలెక్టరు జె.వి. మురళి సుడిగాలి పర్యటన చేశారు. సముద్రంలోని అలల ఉధృతిని, ఇటు గోదావరి ఉధృతిని అయన పరిశీలించారు. గ్రామస్థులతో జాయింటు కలెక్టరు మాట్లాడి వారికి ధైర్యంచెప్పి అధికారయంత్రాంగం మీకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పుకార్లను, వదంతులను నమ్మవద్దని అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా వర్షాలుకురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచనల మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందుగా అప్రమత్తం చేయాలని మత్స్యకారులు తమబోట్లు, వలలు, పనిముట్లను భద్రపరచుకోవాలని అన్నారు. తుఫాను సమయంలో వ్యాధులు ప్రబలే అవకాశముందని వాటి చికిత్సకు కావలసిన మందులు సిద్ధంచేసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులకు అయన సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. జాయింటు కలెక్టరు వెంట సబ్ కలెక్టరు సి.విష్ణుచరణ్, తహశీల్దార్ కందుల బాజీ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

## టిడిపి నేతల హౌస్ అరెస్టులు



పల్నాడు జిల్లా. నరసరావుపేట .మే 11 (ప్రజాపాలన ప్రతినిధి): రాష్ట్రంలో కొనసాగుతున్న రైతు వ్యతిరేక పాలన తో రైతులు కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 11వ తేదీ నిరసన కార్యక్రమం చేపడితే వెన్నులో వణుకు పుట్టింది జగన్ రెడ్డి ప్రభుత్వం టిడిపి నేతలను ముందస్తు అరెస్టు చేయడం దుర్మార్గం.పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీ.వి ఆంజనేయులుతో పాటు ఆరు నియోజకవర్గాల ఇన్చార్జి లకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్టు చేశారు.నరసరావుపేటలో నిరసన ర్యాలీని అడ్డుకునేందుకు వైసీపీ ప్రభుత్వం చెక్ పోస్ట్ వద్ద పోలీసులను మోహరింపు చేసింది.టిడిపి నేతల ఇళ్ల వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి అడ్డుకుంది. జగన్ రెడ్డి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ అప్రజాస్వామిక విధానాలు అవలంభించడం దుర్మార్గమని టిడిపి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆ హక్కు కూడా లేదంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

## శ్రీ వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ



కారంపూడి...మే11 ప్రజా పాలన. ప్రతినిధి :పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ లో శ్రీ వాసవి సేవాదళ్ చలివేంద్రం వద్ద శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా పులిహోర మరియు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు శ్రీ వాసవి సేవాదళ్ వారు అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కరాలపాటి. శ్రీనివాసరావు ధర్మపత్ని లీలావతి, మద్దాల .వినయ్ పృథ్వి ధర్మపత్ని సిరి మాధురి కరాలపాటి .ప్రసాద్ బాబు జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు బవిరిశెట్టి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అనిగండ్లపాడు గ్రామంలో అంగన్వాడీ వార్షికోత్సవ సంబరాలలో :సర్పంచ్ జోతిబ్రహ్మాం



పెనుగంచిప్రోలు మే 11 ప్రజాపాలన ప్రతినిది: మండ లపరిధిలో అనిగండ్లపాడు గ్రామంలో గల అంగన్వాడీ సెంటర్ లో అంగన్వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో వా ర్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగిం ది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రామస ర్పంచ్ బి. జోతిబ్రహ్మాం,ఎంపీటీసీ పొందూరు.విజ య లక్ష్మి పాల్గొన్నారు.ఇందులో భాగంగా ప్రీ స్కూల్ వి ద్యార్థిని, విద్యార్థులు పాటలు, కథలు, డాన్సులు, ఆ టలు, సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.ఈ సందర్భంగా ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు ప్రీ స్కూల్ విద్య ముగించుకొని ఒకటవ తరగతి వెళ్లే పిల్లలకు గ్రామ సర్పంచ్ బి. జోతిబ్రహ్మాం, ఎంపీటీసీ పొందూరు. విజయలక్ష్మి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ, అంగన్వాడి సూపర్వైజర్, మహిళా పోలీస్,అంగ న్వా డి కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి అంశాన్ని అమలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఏటువంటి వ్యతిరేక ఓటు లేదు: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని





గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి మే 11:పట్టణంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొడాలి నాని పాల్గొన్నారు.గుడివాడ పట్టణంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొడాలి నాని పాల్గొన్నారు. పార్టీ నాయకులు ,కార్యకర్తలతో కలిసి పట్టణంలోని 22 వ వార్డులో ఎమ్మెల్యే కొడాలి నాని ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీధివీధిన మహిళలు హారతులతో ఎమ్మెల్యే కొడాలి నాని కు ఘన స్వాగతం పలికారు. రైలు పేట లో ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్యే నాని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజల మరిన్ని అవసరాలను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొడాలి నాని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినమైన డిసెంబర్ 21వ తేదీ నాటికి లబ్ధిదారులకు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి టిడ్కో ఇల్లు అప్పగిస్తానని ఎమ్మెల్యే కొడాలి నాని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుండి పురస్కారాలు పొందిన వాలంటీర్లను ఎమ్మెల్యే కొడాలి నాని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, పట్టణ వైసీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటీ చంటి, వైసిపి నాయకులు, పురపాలక సంఘ అధికారులు ,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి మనిషి రోజుకు ఒక గంట అయినా వ్యాయామం చేయాలి



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి మే11:గన్నవరం జిల్లా ప్రజా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా ప్రాంగణం లో జిల్లా స్థాయి టెన్నిస్ బాల్,క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ సభలో జడ్పీటీసీ ఏలిజబెత్ రాణి మాట్లాడుతూ ప్రతి మనిషి రోజుకు ఒక గంట నడక లేదా ఆటలు అయినా ఆడాలని అన్నారు కారణం ప్రస్తుతం ప్రజల జీవన శైలి లో మార్పులు వచ్చాయి అని అన్నారు ప్రస్తుతం మనిషి కొద్దీ దూరం కూడా నడవటం లేదు సైకిల్ తొక్కటం కూడా చేయటం లేదు సుఖానికి అలవాటు పడుతున్నారు. అని అన్నారు పైగా మనం తీసుకునే ప్రతి ఆహారం లో కుడా కల్తీ ఉంటుంది. దాంతో షుగర్ బీపీ లాంటి అనేక రోగాలు వస్తున్నాయి డాక్టర్లు వద్దకు వెళితే మీరు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు నడవాలి అని అంటున్నారు కష్టపడే అలవాట్లు లేకపోవటం కల్తీ ఆహారం తీసుకోవటం వలన కొందరికి చిన్నతనం లోనే బీపీ షుగర్ లాంటి జబ్బులు వస్తున్నాయి. అని అన్నారు.నిరుద్యోగ యువకులు ఇటువంటి ఆటలకు ప్రాధాన్యత ఇస్తూనందున అందరు ఆరోగ్యంగా వుంటారు అని అన్నారు క్రికెట్ టోర్ల వెంట్ కమిటీ వారిని అభినందిస్తున్నాను ఈ పోటీలకు ఎమ్మెల్యే వంశీమోహన్ తన వంతుగా రు 25000.లు ఇస్తానని ప్రకటించామని చెప్పారు అనిచెప్పరు అనంతరం వైఎస్ఆర్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య మాట్లాడుతూ యువత పేడ మార్గం పడకుండా క్రీడలు బాగా ఉపయోగ పడేవిధంగా నిర్వహకులు కృషి చేయాలనీ అన్నారు. ఇటువంటి ఆటలు సమాజానికి చాలా ఉపయోగం అని అన్నారు. నేను ఎల్లప్పుడూ ఇటువంటి ఆటలను ప్రోచాహిస్తను అని నా వంతుగా 15000లు ఆర్ధిక సహాయం చేస్తానని టి.ఎస్.ఆర్.కే ప్రసాద్ గారు రు 7500 లు ఇస్తామని హామీ ఇచ్చారు. కె.వి.ఆర్. కిషోర్ కిట్టు మరియు యూనిఫాం, మధు ట్రస్టు తరుపున ట్రోపిస్ టి.వెంకయ్య బాల్స్ స్పాన్సర్ చేశారుఆ తరువాత గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య మరియు నిడమర్తి నాగేశ్వరావు కే.వి.ఆర్ అకాడమీ అద్యక్షులు కిషోర్ జెడ్. పి.పాటశాల (బాలుర)హెచ్.ఎం. నిమ్మగడ్డ భవాని , డ్రిల్లు మాస్టర్ నాగరాజు మాట్లాడారు. క్రీడాలా నిర్వహాలు తేజ,అఖిల్, శాయి, అరిఫ్,జగదిష్, అబిష్, మట్లాడుతూ నిరుద్యోగ యువకులు పెడ దోరణలకు పోకుండా ఉద్యోగాలు కు ఉపయోగ పడేవిధంగా ఈ ఆటలు ఆ డిస్తున్నాం అని అన్నారు. మమ్ములను ప్రోచహించిన.స్థానిక మ్మెల్యే వంశీ మోహన్ జెడ్పీటీసీ తోట వెంకయ్య సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వాయిదా



పొన్నూరు మే11( ప్రజా పాలన ప్రతినిధి) :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా పొన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిలారి నేతృత్వంలో నంబూరు గ్రామం లో ప్రారంభ తలపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం వాయిదా పడింది . తుఫాను కారణంగా వాయిదా వేస్తున్నట్లు వైసిపి కార్యాలయం నుండి ప్రకటన చేశారు. తదుపరి ఈ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించే ది త్వరలో తెలియజేస్తామని వారు అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## టీడీపీ కు ప్రజల్లో వస్తున్న స్పందన చూడలేకే అక్రమ కేసులు రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు: ఈది అశోక్



గోకవరం ప్రజాపాలన విలేకరి మే 11: తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజల్లో వస్తున్న స్పందన చూసి ఓర్వలేకే వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తోందని,అందులో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపై, మాజి మంత్రి నారాయణపై కేసులు పెట్టారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఈది అశోక్ అన్నారు.రోజురోజుకు వైసిపి ప్రభుత్వం పై వ్యతిరేకత పెరుగుతూ వస్తుందని,ప్రజలు మళ్ళీ చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల విశాఖ,తూర్పు గోదావరి జిల్లాల్లో చంద్రబాబు పర్యటనకు ప్రజల స్పందన చూసి జగన్మోహనరెడ్డికి,వారి బృందానికి కళ్ళు బైర్లు కమ్మాయని అన్నారు.పరిపాలన చేతగాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరువును జగన్ మంటగలుపుతున్నారని ధ్వజమెత్తారు.జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంటగలిసిందని,ఇలాంటి నియంతృత్వ పరిపాలనను ఎక్కడా చూడలేదని మండిపడ్డారు.కక్షలు అక్రమ అరెస్టులే జగన్ ప్రభుత్వ లక్ష్యమని,ప్రజా ప్రయోజనాలను గాలికొదిలేసారని ధ్వజమెత్తారు.నవ్యాంధ్ర కోసం పరితపించిన చంద్రబాబుపై కేసు దుర్మార్గమని,జగన్ చేసే ప్రతి అరాచకానికి మూల్యం చెల్లించాల్సిందేనని రాష్ట్ర ఎస్సి సెల్ అధ్యక్షులు ఈది అశోక్ అన్నారు.

## హౌస్ ఆఫ్ హెూలీ ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ మరియు అన్నదానం






గోకవరం ప్రజా పాలన విలేకరి మే 11:తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం సంజీవ్ నగరంలో హౌస్ ఆఫ్ హెూలీ ప్రేయర్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో పేదప్రజలకు.ది.10-5-2022 తేదిన బట్టలు. మరియు భోజనాలు పేద ప్రజలకు సహాయము సేసారు. హౌస్ ఆఫ్ హెూలీ ప్రేయర్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కె.యోసేబు మాట్లాడుతూ పేద ప్రజల పడుతున్నా కష్టాలు సూసి ఎంతోకొంత మా మినిస్ట్రీ ద్వారా మా వంతు సహాయం చెయ్యాలి అనే సంకల్పముతో ఈ మినిస్ట్రీ స్థాపించబడినది అన్నారు . అలాగే ఈ మినిస్ట్రీ ద్వారా అనేకమంది పేదవారికి సహాయం చెయ్యాలి అని ప్రతి ఒక్కరు మా మినిస్ట్రీ ఇంకా వేలాది మందికి సహాయం చెయ్యాలి అని ఆ భగవంతుని ప్రార్థనలు చెయ్యాలి అని మీ ఆశీర్వాదములు ఉండాలి అని వారు కోరారు. మినిస్ట్రీ సభ్యులు విశ్వాసులు పాల్గొన్నారు

## నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నేడు, ఎన్నికల తర్వాత నియోజకవర్గఎమ్మెల్యే తధ్యం: డాక్టర్ తాడివలస దేవరాజు



చీరాల, మే 11, ప్రజాపాలన : వైయస్సార్ సీపీ యువ నేతగా చీరాల నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు, కరణం వెంకటేష్ బాబు చేస్తున్న కృషిని, పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గుర్తించారని, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. చీరాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా, కరణం వెంకటేష్ బాబును ప్రకటించడం, దానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పుడు ఇన్చార్జిగా ఉన్న కరణం వెంకటేష్‌బాబు, రాబోయే ఎన్నికలలో అఖండ మెజారిటీతో ఎమ్మెల్యే కావడం ఖాయమన్న ఆత్మవిశ్వాసాన్ని డాక్టర్ తాడివలస దేవరాజు వ్యక్తం చేశారు.ఒంగోలులో, కరణం బలరామకృష్ణ మూర్తి నివాసంలో, చీరాల కొత్తపేట, ప్రసాద్ నగరం యూత్ ఆధ్వర్యంలో, చీరాల వైయస్ఆర్సిపి ఇన్చార్జ్‌గా ఎన్నికైన కరణం వెంకటేష్ బాబు కి శుభాకాంక్షలు తెలిపి, వారిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రసాద్‌నగరం యూత్ మరియు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు,నంగు రాజశేఖర్ రెడ్డి, దొంతిపోయిన నాగరాజురెడ్డి, కోట కిషోర్ రెడ్డి,ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ఇంకొల్లు సీఐ సుబ్బారావు.. అభినందించిన బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్



ఇంకొల్లు, మే 11, ప్రజాపాలన : ఇంకొల్లు సీఐ సుబ్బారావు తన దాతృత్వం చాటుకున్నారు. బాపట్ల జిల్లా పోలీసు శాఖలో కఠినత్వమే కాదు, మానవత్వం ఉందని మరోసారి నిరూపించారు. ఆసానితుఫాన్ కారణంగా, రెండు నిరుపేదకుటుంబాలు రోడ్డున పడ్డాయి. వివరాల్లోకెళితే..తుఫాన్ కారణంగా షార్ట్ సర్క్యూట్ జరగడంతో, రెండు పూరి గుడిసెలు దగ్ధమైన ఘటన మంగళవారం రాత్రి, చిన్నగంజాం మండలం పెద్దగంజాం గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక క్రిస్టియన్ కాలనీకి చెందిన మాచవరపు బెంజమిన్ కుటుంబంతో పాటు మరో కుటుంబాన్ని, ఇంకొల్లు సీఐ సుబ్బారావు తన సిబ్బందితో కలిసి పరామర్శించారు. షార్ట్‌సర్క్యూట్ వలన రెండు పూరిగుడిసెలు పూర్తిగా దగ్ధమ య్యాయి.బాపట్ల ఎస్పి వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు, అగ్నికి ఆహుతైన పూరిళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించేందుకు, ఇంకొల్లు సి.ఐ.సుబ్బారావు వెళ్లారు.ఈ సంఘటనలో కేవలం ఒంటిమీదబట్టలు మాత్రమే బాధితులకు మిగిలాయని తెలుసుకుని,చలించిపోయిన ఇంకొల్లు సీఐ సుబ్బారావు,రెండు బాధిత కుటుంబాలకు తన సొంతనిధులతో, నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు,పప్పు, బియ్యం, వంట సామగ్రి, బట్టలు, దుప్పట్లు పంపిణీ చేశారు. బాధిత కుటుంబసభ్యులు, బాపట్ల జిల్లాఎస్పీ వకుల్‌జిందాల్ కు, ఇంకొల్లుసర్కిల్ పోలీస్ సిబ్బంది కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నగంజాం ఎస్ఐ.నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# శివయ్యను దర్శించుకున్న శివరామరాజు



ఉండి, మే 11 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉండి నియోజకవర్గ ప్రజలు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని పాడిపంటలతో సుఖ సంతోషాలతో సుఖంగా జీవించాలని కోరుతూ ఉండి మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు బుధవారం ఉండి ఎన్.ఆర్.పి అగ్రహారం శ్రీపార్వతీసమేత విశ్వేశ్వరస్వామి, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఉండి సంతమార్కెట్లో ఉన్న పోలేరమ్మ, మహంకాళమ్మ వారి జాతర మహోత్సవ సందర్భంగా నిర్వహించిన అఖండ అన్నసమారాధన కార్యక్రమంలో శాసనసభ్యులు మంతెన రామరాజుతో కలిసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు వేటుకూరి శివరామరాజు మాట్లాడుతూ శ్రీ పార్వతీసమేత విశ్వేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పోలేరమ్మ, మహంకాళమ్మ అమ్మవారి ఆశీస్సులు ఉండి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. పదిసంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు తనవంతు సహకారం అందించడం జరిగిందని అన్నారు. ప్రాణాంతక వైరస్ నుండి ప్రజలను కాపాడేశక్తి భగవంతుడికే ఉందని అందుకు అందరు సంతోషంగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ పి అగ్రహారం గ్రామ పార్టీ ప్రెసిడెంట్ కిన్నెర వెంకన్న, దోసపూడి రాంబాబు, పరిమి కాశి, కరిమెరక శ్రీనివాసరావు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, కాగిత మహంకాళి, కాగిత బుజ్జి, మోపిదేవి నాగశ్రీనివాసరావు, పోలిబోతు రాము తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ పార్టీ లో చేరిన పొన్నూరు జనసేన, టిడిపి నేతలు



పొన్నూరు మే11( ప్రజా పాలన ప్రతినిధి) :రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వం సుపరిపాలనకు ఆకర్షితులైనా గుంటూరు జిల్లా పొన్నూరు టిడిపి ,జనసేన పార్టీ నేతలు బుధవారం ఎమ్మెల్యే కిలారి చొరవతో సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. గుంటూరు జిల్లా జనసేన మాజీ అధ్యక్షుడు మాదా రాధ కృష్ణమూర్తి, గుంటూరు జిల్లా టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ సుభాని, మాజీ ఎంపీపీ కొండా శివనాగిరెడ్డి పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ శాలిని వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.

## ఇంజనీరింగ్ స్కిల్స్ పై అవగాహన కార్యక్రమం



నరసాపురం, మే 11 (ప్రజాపాలన ప్రతినిధి) : నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం డైరెక్టర్ అకడమిక్ ప్లానింగ్ జేయుటియుకె ప్రొఫెసర్ కె.వి.ఎస్.జి మురళీకృష్ణ నేతృత్వంలో టాప్ టెన్ ఇంజనీరింగ్ స్కిల్స్ పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీకృష్ణ ఇంజనీరింగ్ విద్యార్థులు పాటించవలసిన నైపుణ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర విద్యాసంస్థల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కె.వి స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, ఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి వి స్వామినాథన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి చేయండి



భీమవరం, మే 11 (ప్రజాపాలన ప్రతినిధి) : దేవాలయాలకు నూతనంగా నియమింపబడిన పాలకవర్గాలు ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ సూచించారు. గునుపూడి కి చెందిన ఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవార్ల ఆలయానికి సంబంధించి ప్రభుత్వం నూతన ధర్మకర్తల మండలిని నియమించింది. ఈ నేపథ్యంలో నూతన ధర్మకర్తల మండలి బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాసును కలిసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏలూరి సాయి వెంకట సత్యనారాయణ, సభ్యులు కర్రి సోమేశ్వరరావు, చింతాడ శ్రీనివాసరావు, గంధం సీతారాము, గంగమణి మాధవిలత, పొలిమేర మంగతాయారు, బొచ్చా భవానీలు పాల్గొన్నారు.

## జె ఏ సి గా ఏర్పడిన ఎల్ ఐ సి ఎజెంట్స్




వినుకొండ మే 11 (ప్రజాపాలన ప్రతినిధి):ఎల్ ఐ సి డివిజిన్ ఈ సి మీటింగ్ వినుకొండ లోని బృందావనం ఫంక్షన్ హాల్ నందు గుంటూరు కృష్ణ రెండు జిల్లాలకు చెందిన యూనియన్ నాయకులు ఏజెంట్ పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది. ఆ సమావేశంలో ముఖ్య అతిథిగా జోనల్ ప్రెసిడెంట్ మార్కెన్దేయులు పాల్గొని ఏజెంట్స్ ఎదుర్కొనే సమస్యలు గురించి చర్చించారు. సెంట్రల్ లెవల్లో ఏజెంట్స్ అందరూ ఒకే తాటి మీదకొచ్చి జె ఏ సి గా ఏర్పాటు చెయ్యడం జరిగినది. అని పేర్కొన్నారు సభకు డివిజన్ ప్రెసిడెంట్ యెస్ రాంబాబు అధ్యక్షత వహించారు. సమావేశానికి డివిజన్ లోని అన్ని బ్రాంచ్ నాయకులు పాల్గొని ప్రసంగించారు. పాలసీ దారుల ప్రయోజనాల ను కాపాడాలని జి యెస్ టీ ఎత్తివేయాలని, పాలసీ దారులకు బొనస్ లు పెంచాలని ఏజెంట్స్ కి పి యఫ్ సౌకర్యం కల్పించాలని డివిజిన్ లోని అన్ని బ్రాంచ్ నాయకులు కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో వినుకొండ బ్రాంచ్ ప్రెసిడెంటు చెరుకూరి హరనాథ్ బాబు డివిజన్ వైస్ ప్రెసిడెంట్ బాలిరెడ్డి సెక్రటరీ కోటేశ్వరరావు బ్రాంచ్ లోని నాయకులు అధికసంఖ్యలో ఏజెంట్స్ పాల్గొనడం జరిగినది.

## ఫార్మసీ రంగంలో విద్యార్థులకు మంచి అవకాశాలు:ప్రొఫెసర్ విజయలక్ష్మి



నరసరావుపేట .మే 11.( ప్రజా పాలన ప్రతినిధి): ఫార్మసీ విద్యను అభ్యసించిన వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైకాలజీ ప్రొఫెసర్ విజయలక్ష్మి అన్నారు కేసనపల్లి వద్ద గల ఎంఏఎం ఫార్మసీ కాలేజీ నందు గత రెండు రోజులుగా బి ఫార్మసీ విద్యార్థులకు వర్క్ షాపు నిర్వహించారు, వర్క్ షాప్ ముగింపు ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ మాట్లాడుతూ ఫార్మసీ రంగం నిత్యం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని అన్నారు ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు,సలహాలు అందించారు, ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం ప్రసాద్, కోఆర్డినేటర్ డాక్టర్ సి.అజయ్ బాబు,డాక్టరు సాయిశంకర్, అసోసియేట్ ప్రొఫెసర్ షేక్ జాస్మిన్, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి మే11:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అదేశాల మేరకు గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమం ఉంగుటూరు మండలం ఉంగుటూరు గ్రామానికి చేరుకొని గన్నవరం శాసనసభ్యులు డా.వల్లభనేని వంశీ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో పాల్గొన్నారు గ్రామములో వర్షం సైతం లెక్కచేయకుండా ముందుకు సాగుతూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేస్తున్నా డా: వల్లభనేని వంశీ మోహన్..


## అసని తుఫాను వలన ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్



పల్నాడు జిల్లా.నరసరావుపేట.మే 11.(ప్రజాపాలన ప్రతినిధి ):అసని తుఫాను ప్రభావం వలన పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉందని అధికారులంతా అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తుఫాను దృష్ట్యా ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో పంట పొలాల్లో రైతులు, కూలీలు పని చేయవద్దని సూచించారు. మెరుపులు ఉరుములు సమయం లో చెట్ల కింద ,విద్యుత్ సరఫరా అయ్యే ప్రాంతాల్లో ఉండవద్దన్నారు. తుఫాను కారణంగా పల్నాడు జిల్లా మాచర్ల మండలం, వీపీ సౌత్, వాసు వేముల, దాచేపల్లి మండలం అటవీ ప్రాంతం లోని బట్టు వారి పాలెం, తంగెడ, పొందుగల, రామ పాలెం, మాచవరం మండలం తాడిచర్ల, గురజాల మండలం, దైదా, గొట్టుముక్కల, రెంటచింతల అటవీ ప్రాంతం లోని దామర పాడు, బెల్లంకొండ మండలం ప్రాంతం లోని పులిచింతల, కొల్లూరు, చిట్యాల, కేతవరం, బోధామ్, అచ్చంపేట మండలం అటవీ ప్రాంతం లోని మాదిపాడు అగ్రహారం, చింతపల్లి, చామర్రు, కొండవీటి వారి పాలెం, అంబడి పుసి, చిగురుపాడు, కస్థల అగ్రహారం, అమరావతి మండల పరిధిలోని మునుగోడు, పొందుగల, ధరణికోట, పొట్టిపాడు, వెంకటాపురం, జూపూడి, పెద్ద మద్దూరు, గ్రామాలపై తుఫాను ప్రభావం ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తుఫాను ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు, అన్ని మండలాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ తో పాటు, జిల్లా వ్యాప్తంగా 24 గంటలు పనిచేసే విధంగా టోల్ ఫ్రీ నెంబర్ 08647-224455 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ డివిజన్ల అధికారులతో పాటు జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ సూచన మేరకు తుఫాను ప్రభావం ని పరిశీలన చేస్తూ, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు .

## చిన్నారిపై అత్యాచార యత్నానికి ప్రయత్నం



రాజుపాలెం ప్రజాపాలన ప్రతినిధి :పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండల పరిధిలోని రెడ్డి గూడెం గ్రామంలో చిన్నారిపై అత్యాచార ప్రయత్నం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. పిడుగురాళ్ళ రూరల్ సిఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన 42 ఏళ్ల కుంభ హనుమంతరావు అదే గ్రామానికి చెందిన ఓ చిన్నారి కి శీతల పానీయం ఇచ్చి అత్యాచార ప్రయత్నం చేయబోయాడు. ఈ నేపథ్యంలో చిన్నారి తల్లిదండ్రులు తెలపగా తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నం ఫోక్సో చట్టం కింద దిశా పోలీస్ సిబ్బందితో కలిసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ పేర్కొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వము కార్యక్రమాన్ని ప్రారంభించిన మాచర్ల ఎమ్మెల్యే



కారంపూడి...మే11..ప్రజాపాలన.. ప్రతినిధి....మండలం కాచవరం గ్రామంలో ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, పల్నాడు జిల్లా వై.యస్.ఆర్.సి.పి అధ్యక్షులు, మాచర్ల శాసనసభ్యులు శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వము ప్రారంభించడం జరిగింది.ఈసందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు ప్రారంభమయిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కారంపూడి మండలంలోని కాచవరం గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా లేనిచో సంబంధిత వాలంటీర్ మరియు సచివాలయం సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకుని సాధ్యమయినంత త్వరలో పరిష్కరించి వారికి అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కాచవరం గ్రామ సచివాలయం పరిధిలోని ప్రతీ అవ్వ తాతలకు పెన్షన్ వస్తుందా, ప్రతీ తల్లికి అమ్మ వొడి, విద్యా దీవెన, వసతి దీవెన, వితంతువులకు పెన్షన్, వికలాంగులకు పెన్షన్ ఇలా నవరత్నాలు కాక ఇంకా మన ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతీ పథకం అర్హులకు అందుతున్నాయో లేదో స్వయముగా ఎమ్మెల్యే తెలుసుకోవడం జరిగింది.

## ఉన్నత విద్య కల, జగనన్న విద్యాదీవెన ద్వారా సాకారం: బాపట్ల జిల్లా ఎంపవర్మెంట్ ఆఫీసర్ డెరోబా



చీరాల, మే 11, ప్రజాపాలన : ఉన్నత విద్యను అభ్యసించి, తమ ఉజ్వలభవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనే ఆకాంక్షను, తమ తల్లితండ్రుల ఆర్థిక లేమితో బాధ పడకుండా, జగనన్న విద్యాదీవెన ద్వారా పొందినట్లు, పేద కుటుంబాల వారు ఉన్నత విద్య కలను జగనన్న విద్యాదీవెన ద్వారా సాకారం చేసుకున్నట్లు తెలిపారు.బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ డెరోబా మాట్లాడుతూ, నేటి విద్యార్థులకు, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా, చదువు అనే గొప్ప ఆస్తిని అందజేయటం జరుగుతుందన్నారు.సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో, బుధవారం జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి. రమణమూర్తి పర్యవేక్షణలో, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద. వేణుగోపాలరావు అధ్యక్షతన నిర్వహించారు.ఉన్నత చదువులు చదవటానికి పెద్ద స్థాయికి ఎదగటానికి ఎవరికి పేదరికము అడ్డు కాకూడదనే ఆశయముతో,బాపట్ల జిల్లా యస్.సి, యస్.టి, బి.సి మైనారిటి మరియు ఇ.బి.సి సంక్షేమ శాఖల ఆధ్వ ర్యములో,పూర్తి ఫీ జు రియంబర్స్‌మెంట్ నిధులు (జనవరి 2022 నుండి మార్చి 2022 వరకు) విడుదల కార్యక్రమాన్ని, అధికారులు నిర్వహిం చారని తెలియజేసిన, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. మొయిద. వేణుగోపాలరావు మాట్లాడుతూ, కళాశాలలోని జగనన్న విద్యాదీవెన ద్వారా, ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న నాల్గవ సంవత్సరం విద్యార్థులు,అనేక ప్రముఖ బహుళజాతి సాఫ్ట్ వేర్ కంపెనీలలో, ఉన్నత ఉద్యోగ అవకాశాలను పొందటం,కళాశాలకు గర్వకారణమని తెలిపారు. వేటపాలెం ఎం.పి.డి.ఓ.,కె.నేతాజీ మాట్లాడుతూ, విద్యార్థులు జగనన్న విద్యాదీవెన ద్వారా ఉన్నతవిద్యలనభ్యసించి, తద్వారా ఉన్నతఉద్యోగాలను అధిరోహించాలని, తద్వారా పరోక్షముగా సమాజము అభివృద్ధి చెందుతుందని తెలిపారు. డా. బి.ఆర్.అంబేద్కర్ ఉన్నత ఆశయాలక నుగుణంగా, జగనన్న విద్యాదీవెన ద్వారా, లభించిన విద్యాదీవెనను మరియు వసతి దీవెనను ఉపయోగించుకొని, చదువుమీద దృష్టిని సారించి, తమను తాము తీర్చి దిద్దుకోవాలని తెలిపారు.ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఆకాంక్షతో తాము ఎదుర్కొన్న సమస్యలు తెలుపుతూ, జగనన్న విద్యాదీవెన ద్వారా, తాము ఆ సమస్యలను ఎలా అధిగమించారో తెలిపారు. దిగేదాకా నది లోతు తెలియదని, మోసే దాకా బరువు తెలియదని మోసే వాడికే అది తెలుస్తుందని తెలిపారు. తాము ఉన్నత విద్యను అభ్యసించి, తమ ఉజ్వల భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనే ఆకాంక్షను, తమ తల్లి తండ్రుల ఆర్థిక లేమితో బాధ పడకుండా, జగనన్న విద్యాదీవెన ద్వారా పొంది నట్లు తెలిపారు. పేద కుటుంబాల వారు ఉన్నతవిద్య కలను జగనన్న విద్యాదీవెన ద్వారా సాకారం చేసుకున్నట్లు తెలిపారు.బాపట్ల జిల్లా జిల్లా డిస్ట్రిక్ట్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ డెరోబా మాట్లాడుతూ, నేటి విద్యార్థులకు, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన ద్వారా, చదువు అనే గొప్ప ఆస్తి ని అందజేయటం జరుగుతుందన్నారు. జగనన్న విద్యాదీవెన ద్వారా, విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలలో, జమ అయిన నగదు మొత్తాన్ని, కళాశాలల ఫీజులను చెల్లించుటకు ఉపయోగించాలని,అలా చెల్లించని యెడల, తదుపరి వాయిదాలను వారికి అందజేయటం జరగదన్నారు. ఈ కార్యక్రమములో చీరాల నియోజక వర్గములో 5540 మంది విద్యార్థులకు, 4929 బ్యాంకుల ఖాతాలలో, రు. 4,29,08,386 లను, వారి తల్లులఖాతాలలో జమచేయటం జరిగినదని తెలిపారు. జగనన్న విద్యా దీవెన పథకములో, మ్యాపింగ్ ద్వారా బ్యాంక్ఎకౌంటు మరియు ఆధార్ కార్డును మ్యాపింగ్ చేయాలని తెలిపారు. లేని యెడల వారి ఖాతాలలో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకము ద్వారా, జమ అయ్యే నిధులు జమ కావని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ట్రైబల్ వెల్ ఫేర్ ఆఫీసర్, చీరాల, వేటపాలెం మండల అభివృద్ధి అధికారులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు ,కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తుఫానును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది: జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మచిలీపట్నం : మే 11 ప్రజాపాలన ప్రతినిధి : ఆసని తుఫాను ప్రభావం వల్ల ఇబ్బందులు పడే ప్రజల పట్ల మానవతా దృక్పథంతో స్పందించాల నిరాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్.జగన్ మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ లకుఆదేశాలిచ్చారు. బుధవారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి తుఫాను ప్రభావిత ప్రాంతాల జిల్లాకలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లాపరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక,జాయింట్ కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు,ఆర్డీఓ ఐ.కిషోర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో తుఫాను పరిస్థితులపై జిల్లా కలెక్టర్పి.రంజిత్ బాషా ముఖ్యమంత్రితో మాట్లాడుతూ జిల్లాలో అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. పడిపోయిన విద్యుత్ స్థంబాలు, తీగలు, దెబ్బతిన్న రోడ్లను ఎప్పటికప్పుడు పునరుద్ధరించేందుకు అధికారులుసిద్ధంగా ఉన్నారన్నారు. తెగిపడిన చెట్టుకొమ్మలు రహదారికి అడ్డంగా ఉంటే ఈ రోజు ఉదయం అధికారులు, సిబ్బంది కలసి తొలగించారని నివేదించారు. అలాగే జిల్లాలో స్టాక్ పాయింట్లలో నిత్యావసర సరుకులు సిద్ధంగా పెట్టామని కలెక్టర్ నివేదించారు. పీహెచ్ సీలలో ఉన్న గర్భిణీ స్త్రీలను వెంటనే సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తరలించామని కలెక్టర్ చెప్పారు. 800 హెక్టార్లలో 1.27 కోట్లరూపాయల అరటి, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని ఆయన చెప్పారు. అలాగే 80 హెక్టార్లలో 790మంది రైతుల పొలాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిందన్నారు. జిల్లాకు మంజూరు చేసిన 1.25 కోట్లరూపాయలను పునరావాస కేంద్రాల్లో పెట్టే వారి కోసం వినియోగిస్తామన్నారు. జిల్లాలో 12 పునరావాసకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటివరకూ జిల్లాలో పరిస్థితి చక్కగా ఉందని కలెక్టర్ని వేదించారు. ఇప్పటి వరకు సగటున 9.88 మీ.మీ వర్షపాతం మాత్రమే నమోదయిందన్నారు. భారీ వర్షాలు కురిస్తే ఎన్డీఆర్ఎఫ్, ఎసిడిఆర్ఎఫ్ బృందాలను తరలించేందుకు సిద్ధం చేశామన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ పెట్టమని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ కలెక్టర్ కు ఆదేశాలిచారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సహాయం కోసం 08672-252572 నెంబరును ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.ఎస్పీ సిద్ధార్ద్ కౌశల్ మాట్లాడుతూ జిల్లాలో పరిస్థితి ప్రమాదం కాకుండా పోలీస్ సిబ్బంది వారిని ఆదుకొనేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎక్కడ అవసరమైతే అక్కడకు మెరైన్, ఎస్ఆర్ఎఫ్, ఎ'ఆర్ఎఫ్ రక్షక బృందాలను సహాయం కోసం పంపేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశం లో డిఎంఅండ్ హెచ్ ఓ సుహాసిని, జిల్లా వ్యవసాయ అధికారి మనోహరరావు, డిఆర్డిఏ పీడీ సునీత, పంచాయతీరాజ్ ఎస్ఇ వీరాస్వామి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పి.ఎఫ్ సమస్యలను పరిష్కారం చేయాలి: ఎపిటిఎఫ్ (1938) డిమాండ్



గుంటూరు(ప్రజాపాలన ప్రతినిధి ):ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జిల్లా ప్రజాపరిషత్, మండలపరిషత్ పాఠశాల లో పనిచేయుచున్న ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ను వారి ఖాతాలో సకాలంలో నమోదు చేయాలనీ,వారి సమస్యలను పరిష్కారం చేయాలనికోరుతూ గుంటూరు జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి కి ఎపిటిఎఫ్ (1938)గుంటూరు జిల్లా శాఖ విజ్ఞాపన పత్రం ద్వారా డిమాండ్ చేసింది. ఈ సందర్బంగా ఎపిటిఎఫ్ (1938)జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వందలాది ఉన్నత, ప్రాధమికోన్నత, ప్రాథమిక పాఠశాల లో పనిచేయుచున్న ఉపాధ్యాయులు వారి జీతాలనుండి పొదుపు చేసుకుంటున్నారన్నారు.కాని కొందరికి సెప్టెంబరు2021నుండి నేటి వరకు వారి పొదుపు ఖాతా లకు జమ కాలేదనీ,అలా నమోదు కాకపోవడం చే లక్షలాది రూపాయలు అనామత్ ఖాతాలో ఉంటున్నాయనీ,అంతేకాకుండా వేలాది రూపాయల వడ్డీని కూడ ఉపాధ్యాయులు నష్టం పోతున్నారనీ ఆయన సి.ఇ.ఓ కి వివరించారు.రాష్ట్ర కౌన్సిలర్ కట్టె బోయిన నర్సింహారావు సి.ఇ.ఓ తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం "నాడు..నేడు".. ద్వారా కోట్లాది రూపాయలు తో పాఠశాల ను అభివృద్ధి చేస్తుంటే,కొన్ని ఉన్నత పాఠశాలలకు నేటికి కూడ' రాత్రి కాపాలాదారుడు' లేక పోవడం వల్ల ఆయా పాఠశాల లో కొన్ని అసాంఘిక శక్తులు నష్టం పరుస్తున్నారన్నారు.కావున ప్రతి ప్రభుత్వ పాఠశాల లకు రాత్రి కాపాలాదారున్ని నియమించాలని కోరారు..ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ పి.యఫ్ కార్యాలయం లో పి.ఎఫ్ నమోదుకు క్రొత్తగా ఒక కంప్యూటర్, ఒక టీమ్ ను ఏర్పాటు చేసి,పెండింగ్‌లో నున్న మినహాయింపులు,ఉపాధ్యాయుల ఖాతాలో చేరే టట్లు చర్యలు తీసుకుంటామనీ తెలియజేశారు. అదే విధంగా సి.యం.ఎఫ్. యస్ వారు పంపే షెడ్యూల్ లకు ,నగదు పుస్తకం లోని విలువులకు తేడాలు ఉండుటం వలన కొంతమంది ఉపాధ్యాయుల ఖాతాలో నమోదు కాలేక పోతున్నాయు. అందువలన డ్రాయింగ్ ఆఫీసర్స్ వారి సంతకాల తో కూడిన జీతాలు నుండి మినహాయింపు చేసిన షెడ్యూల్ ను జిల్లాపరిషత్ కు పంపాలని కోరారు.ప్రావిడెంట్ ఫండ్ పై ఋణాలు తీసుకునే వారు వివరాలను పూర్తి స్థాయిలో పూర్తి చేయాలనీ,నిల్వ మొత్తంలో 75% ఋణం మంజూరు డ్రాయింగ్ అదికారులే మంజూరు చేయాలనీ,10లక్షల కు మించి వైద్య ఖర్చుల నిమిత్తం ఋణాలకు అప్లయ్ చేసే వారు,ప్రభుత్వం గుర్తింపు పొందిన సివిల్ సర్జన్ వారి చే ఆ మెడికల్ సర్టిఫికేట్ ను తీసుకోవాలని సూచించారు.అలాకాని పక్షంలో ఆ ఋణ పత్రాలను తిరిగి పంపబడునని తెలిపారని జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు తెలిపారు.

## ఆదినారాయణ కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా ఓరుగంటి



కారంపూడి...మే11..ప్రజాపాలన.. ప్రతినిధి :పట్టణంలోని వినుకొండ రోడ్డు లో ఆదినారాయణ కాలనీ నందు జరిగిన సమావేశంలో ఆదినారాయణ కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా ఓరుగంటి. వెంకట్రామిరెడ్డి ని ఎన్నుకోవటం జరిగింది ఈ సంద్భంగా వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ ఆదినారాయణ కాలనీ అభివృద్ధి కి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ సమావేశం లో వై.సి.పి నాయకులు కోమ్ము. చంద్ర శేఖర్, రమవాత్.కోమటి నాయక్,పొన్నలురి.సుభాని, ధారివేముల.దాసు, ఇరిగీ.రవి,వాడితే. హనుమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం



పామర్రు,ప్రజాపాలన ప్రతినిధి మే 11:ప్రజలందరికి సంక్షేమ పాలన అందించే దిశగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి అమలు చేస్తున్న విధానాలతో గడప గడపలో సంతోషాలు విరాజిల్లుతున్నాయని శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు.యలకుర్రు గ్రామంలో గడప గడపకు మీ జగనన్న ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించిన పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులుకైలే అనిల్ కుమార్,ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరును, సచివాలయ కార్యదర్శులు,వాలంటీర్లు అందిస్తున్న సేవలను ప్రతి ఇంటికి తిరిగి వివరించారు..కార్యక్రమంలో వై.సీ.పీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు మరియు అధికారులు పాల్గొన్నారు...


## రణ్‌వీర్‌ని ఆకట్టుకున్న "పుష్ప" లోని మాస్ సాంగ్!



రణ్‌వీర్ సింగ్ దేశంలోనే పెద్ద స్టార్. అతను ఇప్పుడు తన కొత్త చిత్రం జయేష్‌భాయ్ జోర్దార్‌ను ప్రమోట్ చేస్తున్నాడు. త్వరలో ఈ చిత్రం థియేటర్ల లోకి రానుంది. ఈ చిత్రంలోని ఓ పాట కూడా వైరల్‌గా మారింది. ఇటీవల వచ్చిన పాటలు ఏవి ఆకట్టుకున్నాయి అని రణ్‌వీర్‌ని అడిగితే, ఇంట్రెస్టింగ్ సమాధానం ఇచ్చాడు. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప చిత్రం లోని ఊ అంటావా మావా అనే పాట ఆకట్టుకుంది అంటూ చెప్పుకొచ్చారు. ఇంకా జోడిస్తూ, పాట సౌండింగ్ తనకు ఏదో చేస్తుందని మరియు పాట ప్లేస్ చేసినప్పుడల్లా, ఆపలేనని రణవీర్ చెప్పాడు. రణవీర్ నుండి కాంప్లిమెంట్ పొందడం చాలా పెద్ద విషయం మరియు అలాంటి హిట్ నంబర్‌ను కంపోజ్ చేసినందుకు డిఎస్పీ క్రెడిట్ పొందాలి.

## 'లైగర్' బ్యూటీపై జోక్...చుంకీ పాండే ఫీలయ్యాడా?

యంగ్ హీరోయిన్ అనన్య పాండే ఇప్పుడిప్పుడే బాలీవుడ్ లో కెరీర్ ని బిల్డ్ చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. చుంకీ పండే..భావనా పాండే కుమార్తెగా ఎంట్రీ ఇచ్చిన అమ్మడు కుర్ర నాయికల్లో అందరికన్నా యాక్టివ్ గా దూసుకుపోతుంది. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లు అందుకుని పూల బాట నిర్మించుకుంది. 'లైగర్' సినిమాతో యువ నాయిక టాలీవుడ్ లోనూ లాంచ్ అవుతుంది. పూరి జగన్నాద్ దర్శకత్వం వహిస్తున్న సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఇక బ్యూటీ సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. నిత్యం టెంప్టింగ్ ఫోటోలతో యువత అటెన్షన్ డ్రా చేస్తుంది. ఇది తరుచూ జరిగే చర్య. మరి డైలీ ఈ పని చేసి చేసి బోర్ కొట్టిందో! ఏమో ఈసారి డిఫరెంట్ గా ఓ వీడియో చేసింది. అనన్య పాండే మేకప్ వేసుకుంటుండగా....కొరియో గ్రాఫర్ ఫరాఖాన్ అనన్యా అనన్యా అంటూ దూసుకొస్తూ నువ్వు ఖలీ పిలీ సినిమాకి గాను జాతీవ అవార్డు గెలుచుకున్నావ్ అంటూ బిగ్గర్ గా చెబుతుంది. దీనికి అనన్య ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బితుంది. చుట్టూ ఉన్న మేకప్ గ్యాంగ్ సైతం సంతోషం వ్యక్తం చేస్తారు. ఇంతలో కూల్ గా చేతులు కట్టుకుని నేను జోక్ చేస్తున్నాని అని అంటుంది ఫరాఖాన్. దీంతో అనన్య అప్సట్ మూడ్ లోకి వెళ్లిపోతుంది. ఈ వీడియో గురించి అనన్య మాట్లాడుతూ.. ఈవీడియోకి 50 రూపాయలు ఇస్తాను. కేవలం ఓవర్ యాక్టింగ్ కే. ఫరాఖాన్ తో ఎప్పుడూ హాస్యాసపదంగానే ఉంటుంది అని తెలిపింది. ఈ వీడియో చూసిన చుంకీ పాండే ఏమన్నారంటే?.. ఫరా ఈ వీడియోలో అతిగా నటించినందుకు నీకు అవార్డు రావాలి అన్నారు. దీనికి బధులుగా ఫరా ఇలా అంటుంది.. 'అప్నీ బేటికో సంభాల్ పెహ్లే' అని అంటుంది.



ప్రస్తుతం ఈ వీడియోపై ట్రోలర్లు ఆడుకుంటున్నారు. తమదైన శైలిలో మీమ్స్ చేస్తూ ఆటపట్టిస్తున్నారు. ఆ సంగతి పక్కనబెడితే కుమార్తెను ఇలా ఆట పట్టించడం చుంకీ పాండేకి నిజంగా నచ్చలేదా? అందుకేనా! అంత వేగంగా 'అవార్డు నీకే రావాలి అంటూ' పరాఖాన్ పై కౌంటర్ వేసారంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కుమార్తెలపై చిన్న జోకులేసినా తట్టుకోలేని తల్లిదండ్రులుంటారు. అసలే చుంకీ గారాల పట్టి. కెరీర్ ఇప్పుడే మొదలు పెట్టంది. అనన్యపై జోకులేయడం ఫరాకి కొత్తేం కాదు. ఇది అలవాటుగా మారిపోతే ప్రమాదకరమే. అందుకే చుంకీ కౌంటర్ వేసారని అంటున్నారు.

## ఎన్టీఆర్ బర్త్ డే... ఆ మూడవ సర్ ప్రైజ్ ఏంటీ?



యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కన్ఫర్మ్ అయిన రెండు సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ ను ఇవ్వబోతున్నారు. ముఖ్యంగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందబోతున్న ఎన్టీఆర్ 30 కి సంబంధించిన అప్డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆర్ ఆర్ ఆర్ ముగిసి నెలలు గడుస్తున్నా కూడా ఎన్టీఆర్ 30 సినిమా ఎప్పుడు మొదలు అయ్యేది క్లారిటీ ఇవ్వడం లేదు. ఆచార్య సినిమా ఫలితం బెడిసి కొట్టడంతో ఎన్టీఆర్ 30 సినిమా మరికాస్త ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఎన్టీఆర్ 31 సినిమా కూడా ఇప్పటికే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో కన్ఫర్మ్ అయిన విషయం తెల్సిందే. ఎన్టీఆర్ 31 సినిమా కు సంబంధించిన షూటింగ్ ప్రారంభం అవ్వడానికి ఇంకా చాలా సమయం ఉంది. అయినా కూడా ఇప్పుడే సినిమా నుండి ఎన్టీఆర్ లుక్ ను రివీల్ చేస్తారనే వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ రెండు సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ వస్తాయని ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ట్రిపుల్ ధమాకా అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దాంతో ఆ మూడవ సర్ ప్రైజ్ ఏమై ఉంటుందా అంటూ ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇంతకు ఆ మూడవ సర్ ప్రైజ్ ఏంటీ అంటే ఆర్ ఆర్ ఆర్. ఔను... ఆర్ ఆర్ ఆర్ సినిమా ను మే 20వ తారీకున ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా స్ట్రీమింగ్ కు సిద్దం చేశారు. థియేటర్లలో అద్బుతమైన విజయాన్ని సొంతం చేసుకున్న ఆర్ ఆర్ ఆర్ ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్ కు సిద్దం అయ్యింది. ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు కూడా ఖచ్చితంగా ఓటీటీ లో సినిమా ను చూడాలని భావిస్తారంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలను తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా విదేశాల్లో కూడా భారీ ఎత్తున ప్లాన్ చేశారు. ఆర్ ఆర్ ఆర్ సినిమా తో పాన్ ఇండియా స్టార్ గా ఎన్టీఆర్ నిలిచాడు. పాన్ ఇండియా స్టార్ గా ఎన్టీఆర్ మొదటి పుట్టిన రోజు కనుక ఖచ్చితంగా దేశం చూసే విధంగా సోషల్ మీడియాలో మరియు బయట భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## మహేశ్ తో మూవీ చేయాలనే..
# నా డ్రీమ్ నెరవేరింది: పరశురామ్



పరశురామ్ దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రూపొందిన 'సర్కారువారి పాట' కోసం అభిమానులంతా ఎంతో ఆసక్తితో .. ఆతృతతో ఎదురుచూస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ సినిమా రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో కొంతసేపటి క్రితం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో పరశురామ్ మాట్లాడుతూ .. "మీడియా మిత్రులందరికీ ముందుగా థ్యాంక్స్ చెబుతున్నాను. వారి సహకారం లేకపోతే 'సర్కారువారి పాట'కి ఈ రోజున ఇంత బజ్ వచ్చేదే కాదు. నా కెరియర్ మొదటి నుంచి కూడా నేను చిన్న సినిమా చేసినా .. పెద్ద సినిమా చేసినా మీడియా నన్ను సపోర్టు చేస్తూ వస్తున్నందుకు ఆనందంగా ఉంది. సినిమ చాలా బాగా వచ్చింది .. సినిమా కోసం పనిచేసిన మేమంతా చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాము. రైటింగ్ సైడ్ గానీ .. విజువల్స్ పరంగా గానీ .. హీరో లుక్స్ పరంగా గానీ .. మిగతా ఆర్టిస్టుల పెర్ఫార్మెన్స్ గానీ .. కథను తీసుకుని వెళ్లే విధానం గాని అన్నీ కూడా నెక్స్ట్ లెవెల్లో ఉ ండబోతున్నాయి. మహేశ్ బాబు గారు నాపై నమ్మకంతో ఈ ప్రాజెక్టును అప్పగించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి నా వంతు ప్రయత్నం చేశాను. దాదాపు సక్సెస్ అయ్యాననే అనుకుంటున్నాను. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా మంచి అవుట్ పుట్ వచ్చింది. రేపు అందరి నుంచి వచ్చే రెస్పాన్స్ కోసం ఎంతో మా టీమ్ అంతా వెయిట్ చేస్తోంది. మహేశ్ తో ఒక సినిమా చేయాలనేది మొదటి నుంచి కూడా నా డ్రీమ్. అలాంటి అవకాశం ఎప్పుడు వస్తుందా అనుకున్నాను. ఈ సినిమాతో నా కోరిక నెరవేరింది. డైరెక్టర్ ను ఎంత ఫర్టుగా ఉంచితే అంతమంచి అవుట్ పుట్ వస్తుందని భావించే హీరోల్లో ఆయన ఒకరు. ఈ సినిమా విషయంలో నేను ఇంత కాన్ఫిడెంట్ గా ఉండటానికి కారణం మహేశ్ బాబుగారు ఇచ్చిన సపోర్ట్ అనే చెప్పాలి. కథ వినగానే ఆయన ఓకే చెప్పారు .. ఎలాంటి మార్పులు చేర్పులు చెప్పలేదు. ఇది పాన్ ఇండియా స్థాయిలో చేద్దామని ముందుగా అనుకోలేదు. తెలుగు ఆడియన్స్ ను దృష్టిలో పెట్టుకుని రాసుకున్న కథ ఇది. ఈ కథలో ఎక్కడా రాజకీయాలు ఉండవు. ఇది ఫ్యామిలీ ఆడియన్స్ ఎక్కువగా లైక్ చేసే లైన్ తో ముందుకు వెళుతుంది. మహేశ్ బాబు 'ఒక్కడు' సినిమా చూసిన తరువాత తప్పకుండా నేను డైరెక్టర్ ను కావాలని అనుకున్నాను. ఇక మహేశ్ బాబు 'పోకిరి' చేసేటప్పుడు నేను పూరి గారి దగ్గర వర్క్ చేస్తున్నాను. నేను కూడా మహేశ్ బాబుగారితో ఒక సినిమా చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. ఆ సినిమా మహేశ్ కెరియర్లోను .. నా కెరియర్లోను చెప్పుకోదగినదిగా ఉండాలనే ఉద్దేశంతో ప్రయత్నాలు చేస్తూ వెళ్లాను. ఆ ప్రయత్నానికి ఫలితమే ఈ 'సర్కారువారి పాట' అని చెప్పుకొచ్చాడు.

# నిట్రో స్టార్ ఫ్యాన్స్ కి సర్ ప్రైజ్ ఇచ్చేశాడు

కొంత మందికి ఫాస్ట్ గా స్టార్ డమ్ ని ఏలేయాలని ఎంజాయ్ చేయాలని వుంటుంది..కానీ కొంత మందికి మాత్రం స్లో అండ్ స్టడీగా వెళదాం అంటూ సెలెక్టీవ్ పసినిమాలతో వెళుతుంటారు. అలాంటి వాళ్లలో నిలిచే హీరో సుధీర్ బాబు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యామిలీ అండతో సినిమాల్లో కి ఎంట్రీ ఇచ్చినా తనదైన స్టైల్ ని అనతికాలంలోనే సొంతం చేసుకున్నారు. అయితే భారీ రేంజ్ సినిమాల్లోకి ఇంకా ఎంట్రీ ఇవ్వడం లేదు. తనకు తగ్గ కథలతో స్లో అండ్ స్టడీ అనే ఫార్మలాతో విభిన్నమైన కథలతో ముందుకు సాగుతున్నారు. నేడు ఈ హీరో పుట్టిన రోజు. ఈ సందర్భంగా తన ఫ్యాన్స్ కి సర్ ప్రైజ్ ఇచ్చేశారు. అంతే కాకుండా అందరు స్టార్ లకు ముందు ఓ బిరుదు వున్నట్టుగానే తనకూ నిట్రోస్టార్ అనే ట్యాగ్ ని తాజాగా యాడ్ చేయడం విశేషం. సుధీర్బాబు 'శ్రీదేవి సోడా సెంటర్' తరువాత రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. ఇంద్రగంటి మోహన్ కృష్ణ డైరెక్ట్ చేస్తున్న 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' చిత్రీకరణ దశలో వుంది. ఈ మూవీతో పాటు శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పీ బ్యానర్ పై హర్షవర్ధన్ డైరెక్ట్ చేస్తున్న సినిమాలోనూ నటిస్తున్నారు. నారాయణ దాస్ నారంగ్ పుస్కూర్ రామ్మోహన్ రావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు హిందీ భాషల్లో బై లింగ్వల్ మూవీగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ చిత్రానికి 'మామా మశ్చీంద్ర' అనే టైటిల్ ని ఖరారు చేశారు. అంతే కాకుండా ఈచిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ ని హీరో సుధీర్ బాబు పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ చేశారు. ఇదే పోస్టర్ పై సుధీర్ బాబుని నిట్రోస్టార్ అని సంబోధించడం విశేషం. ఫస్ట్ ఉలక్ పోస్టర్ లో సుధీర్ బాబు రెట్రో లుక్ లో రాక్ స్టార్ గా కనిపిస్తున్నాడు. పోస్టర్ లో సుధీర్ బాబు స్క్రీన్ ప్రజెన్స్ చాలా డైనమిక్ గా వుంది. సినిమా టైటిల్ 'మామా మశ్చీంద్ర' సౌండింగ్ కూడా చాలా కొత్తగా వెరైటీగా వుంది. టైటిల్ కు చాలా మీనింగ్ వుంది. పవర్ కోసం ప్రయత్నించే వాడు యాంబీషియస్ కరేజియస్ ఇలా చాలా అర్థాలున్నాయి. ఇందులో హీరో ఏ తరహాలో కనిసిస్తాడో చూడాలి. సినిమాలో హీరో సుధీర్ బాబు మల్టీషేడ్స్ వున్న ఛాలెంజింగ్ రోల్ లో కనిపించబోతున్నారట. ఫాంకీ కాస్ట్యూమ్స్ లో పంబ్ లో వున్న స్టేజ్ పై రాక్ స్టార్ గా సుధీర్ బాబు కనిపిస్తున్న తీరు సినిమాపై అంచనాల్ని పెంచేస్తోంది. సుధీర్ బాబు చాలా ఛాలెంజింగ్ గా తీసుకుని ఈ సినిమా చేస్తున్నాం ట. ఈ మూవీని హిందీలోనూ రిలీజ్ చేయనున్న నేపథ్యంలో గ్రేట్ టెక్నీషియన్స్ ని తీసుకున్నారు.




చేతన్ భరద్వాజ్ సంగీతం పీజీ విందా సినిమాటోగ్రఫీ ఆర్ట్ రాజీవ్.. ఇలా ప్రతీ ఒక్కరిని టాప్ టెక్నీషియన్స్ ని ఈ మూవీ కోసం తీసుకున్నారు. 'బాఘీ' చిత్రంతో హిందీలోనూ మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న సుధీంబాబు ఈ సినిమాతో హీరోగా అక్కడి ప్రేక్షకులని కూడా అలరించబో తున్నారు. సరికొత్త నేపథ్యంలో విభిన్నమైన కథగా తెరకెక్కుతున్న'మామా మశ్చీంద్ర' యాక్షన్ ఎంటర్ టైనర్ గా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుం దని చిత్ర బృందం చెబుతోంది. చాలా రోజుల తరువాత బ్యాక్ టు బ్యాక్ రెండు చిత్రాలతో ప్రేక్షకుల ముందుక రాబోతున్న సుధీర్ బాబు కెరీర్ మరో టర్న్ తీసుకుంటుందో లేదో తెలియాలంటే 'మామా మశ్చీంద్ర' రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్
BUSINESS v/s SOCIAL ENGINEERING
20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి
BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు
SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.
స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది
అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం
అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది
మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్
జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com